షికారు.. ఆశలపై నీళ్లు

- పాలేరు జలాశయంలో రొయ్యల వేట లేనట్టే..
- కార్ప్ జాతి చేపలతోనే సరి
- వెయ్యి మత్స్యకారుల కుటుంబాల ఉపాధికి దెబ్బ
- సుమారు రూ.5 కోట్లకు పైగా నష్టం

7

చేకూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

- జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన ధన్యజీవి కాశయ్య
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొత్తగూడెంలో చేకూరి కాశయ్య కాంస్య విగ్రహావిష్కరణ



దివంగత చేకూరి కాశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి తుమ్మల, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, మాజీ ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీతివంతమైన రాజకీయ విశిష్టసేవలు అందించిన దివంగత మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ చేకూరి కాశయ్య ఆశయాలను ఈ తరం రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకు తీసుకెళ్లాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రాజకీయాలకతీతంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించిన ధన్యజీవి కాశయ్య అని ఆయన సేవలను కొనియాడారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటరులో చేకూరి కాశయ్య కాంస్య విగ్రహాన్ని ఆదివారం మంత్రి తుమ్మల, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాజీమంత్రి వనమా వెంకటేశ్వరరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ కాశయ్య తన కుటుంబాన్ని సైతం పక్కనపెట్టి నిరంతరం రాజకీయాల్లో ఉంటూ పేదల కోసం పని చేశారన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కీర్తిని రాష్ట్ర వ్యాప్తంగా ఇనుమడింపచేశారన్నారు. 1983 నుంచి తనకు రాజకీయాల్లో చేకూరి కాశయ్య తెలుసునని, ఆయన ప్రభావం తనపై ఉందన్నారు. చేకూరి చేసిన సేవల ఫలితంగానే ప్రజలు ముందుకొచ్చి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. చేకూరి కాశయ్య విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు మాజీమంత్రి వనమా విశేష కృషి చేశారన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చేకూరి కాశయ్య నిరాడంబరంగా ఉంటూ పేద ప్రజల అభివృద్ధికోసం ఎంతో కృషి చేశారన్నారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చేకూరి కాశయ్య తనకు ఎంతో ఆదర్శమని, (మిగతా 6వ పేజీలో)

ఐదు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో భూ వివాదాలతో సతమతమవుతున్న గిరిజనేతర రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన భూ భారతి చట్టం ఊరటనిస్తుందా? 1/70 చట్టం మూలంగా గిరిజన-గిరిజనేతరుల్లో తలెత్తిన భూ వివాదాలకు నూతన చట్టం ముగింపు పలుకుతుందా? గిరిజన చట్టాల మూలంగా తలెత్తిన వివాదాలు స్థానిక సర్దుబాట్లు ఒప్పందాలతో సద్దుమణిగి సాఫీగా సాగుతున్న గిరిజనేతరుల సాగుకు భూ భారతి మూలంగా కడగండ్లు ఎదురవుతాయా? మరోమారు గిరిజన-గిరిజనేతరుల నడుమ భూ వివాదాలు తలెత్తే ప్రమాదాలు పొంచి ఉన్నాయా? అంటే ఏజెన్సీ ప్రాంతాల్లో అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి.



‘భూ భారతి’ కరుణించేనా?

- నూతన రెవెన్యూ చట్టంపై గిరిజనేతరుల్లో ఆశలు
- ఏజెన్సీ చట్టాల నడుమ అందని దాక్షలా భూ హక్కులు
- రెవెన్యూ సదస్సుల్లోనూ భరోసా కరువు
- గిరిజన ప్రాంతాల్లో మళ్లీ భూ వివాదాల ముప్పు

ఇల్లెందు, మే 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన భూ భారతి చట్టం గతంలో తలెత్తిన భూ వివాదాలకు ఘర్షణలకు ధరణి మూలంగా ఉత్పన్నమైన సమస్యలకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా అమలు చేసేందుకు శరవేగంగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసి రెవెన్యూ సదస్సులు జరిపి స్థానిక భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించింది. జూన్-2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతిని అమలు చేయాలన్న పట్టుదలతో అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ భూ భారతి ద్వారా కలిగే ప్రయోజనాలు హాజరైన రైతులకు వివరిస్తున్నారు. ప్రధానంగా అధికారుల్లో జవాబుదారీ తనం భూ సమస్యల పరిష్కారాల అధికారాల వికేంద్రీకరణ, పారదర్శకతతో పాటు ప్రభుత్వ భూముల పరిరక్షణ లక్ష్యంగా భూ భారతి అమలుకు ప్రభుత్వం పూనుకుంది. దీని ద్వారా రైతులకు రక్షణ లభిస్తుందని భూ సంబంధ సమస్యలు సత్వరం పరిష్కరించబడుతాయని భూములపై రైతులకు హక్కులు రికార్డుల్లో నమోదవుతాయని మంత్రులు కలెక్టర్లు, అధికారులు రెవెన్యూ సదస్సుల్లో వివరిస్తున్నారు.

ప్రయోజనాలు అనేకం

భూ భారతి ద్వారా ప్రభుత్వం చెబుతున్నట్లు రైతులు ఎదుర్కొంటున్న అనేక భూ సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్న ఆశలు రైతుల్లో చిగురిస్తున్నాయి. పెండింగ్ సాదాబైనామాల క్రమబద్ధీకరణతో పాటు కాలపరిమితితో కూడిన పరిష్కారాలు చూపేరీతిలో భూ భారతి రూపుదిద్దుకుంది. అంతే గాక అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల కబ్జాలపై అక్రమ నమోదులపై చర్యలు తీసుకునే అవకాశాలు కల్పించారు. సాగుభూములతో పాటు ఇళ్ల స్థలాలు, నివాస గృహాలపై కూడా సంపూర్ణ హక్కులు యజమానులకు కల్పించే విధంగా, అసైన్డ్ భూములు, (మిగతా 6వ పేజీలో)

భూ భారతిపైనే భారం

ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా గిరిజనేతరుల భూ సమస్యలు జఠిలంగా ఉండటంతో రెవెన్యూ సదస్సుల్లో గిరిజనేతరుల ప్రశ్నలకు అధికారులు సైతం సరైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం. మానవీయ కోణంలో ఏజెన్సీ ప్రాంతాల భూ సమస్యలు పరిష్కరించుకోవాల్సి ఉందని జిల్లాస్థాయి ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. తాజాగా అమలు చేస్తున్న భూ భారతి కారణంగా గతంలో వివాదాల్లో కూరుకుపోయిన భూములు, సాదాబైనామాల ద్వారా అనుభవిస్తున్న భూములు స్థానిక సర్ధుబాట్లు, ఒప్పందాలతో సాగులో ఉన్న రైతుల భూములు, క్రయవిక్రయాల అంశాలు మరో పర్యాయం ఏజెన్సీ మండలాల్లో ఘర్షణలకు వివాదాలకు దారి తీస్తాయన్న ఆందోళన సైతం రైతుల్లో వ్యక్తమవుతోంది. తాత-ముత్తాతల కాలంలో జరిగిన క్రయవిక్రయాలు సైతం ఎలాంటి వివాదాలకు దారితీస్తాయోనన్న ఆందోళన గిరిజనేతరుల్లో వ్యక్తమవుతుంది. ఎల్‌టీఆర్ నోటీసులతో ట్రైబల్ కోర్టుల్లో కూరుకుపోయిన వివాదాల భూములు, తమకు భూములు ఎలా సంక్రమించాయో ఆధారాలు చూపితేనే రిజిస్ట్రేషన్‌లకు, మ్యుటేషన్‌లకు అవకాశం ఉండటంతో గిరిజన చట్టాల చట్రంలో భూభారతి ఎలాంటి పరిష్కారం చూపుతుందోనన్న ఉత్కంఠ ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొంది. గిరిజన-గిరిజనేతరుల భూ సమస్యలకు మానవీయ కోణంలో భూ భారతి ద్వారా ఎలాంటి పరిష్కారాలు చూపుతారోనన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. ఐదు దశాబ్దాలుగా వివాదాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న ఏజెన్సీ ప్రాంతాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని ఏజెన్సీ ప్రాంతాల రైతులు వేడుకుంటున్నారు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

- ఖమ్మంలో 2,671 మంది..
- కొత్తగూడెంలో 1,058 మంది పరీక్షకు హాజరు
- పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

ఖమ్మం ఖానాపురంహవేలి/కొత్తగూడెం అర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యలో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్-25 ప్రవేశ పరీక్ష ఆదివారం ఉమ్మడి ఖమ్మంజిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మంలో 6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా 2,739 మంది విద్యార్థులకు గాను 2,671 మంది పరీక్షకు హాజరయ్యారు. 68 మంది గైర్హాజరైనట్టు నీట్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నగరంలో నీట్ శిక్షణ తీసుకున్న తల్లీకూతుర్లు ఆదివారం నీట్ పరీక్ష రాశారు. కూతురు లాంగ్ టర్మ్ కోచింగ్, తల్లి షార్ట్‌టర్మ్ కోచింగ్ తీసుకొని నీట్ పరీక్ష రాశారు. సూర్యాపేట జిల్లా, (మిగతా 6వ పేజీలో)

మధిరకు అధునాతన సౌకర్యాలు

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రూ.128కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి భూమిపూజ

మధిరటౌన్, మే4(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని మధిర ప్రజలకు అధునాతన సౌకర్యాలు, మౌళిక వసతులు కల్పించడలే లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసినట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మధిర మునిసిపాలిటీలో రూ.128కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే మధిరలో మురుగు వాసన అనేదే ఉండదన్నారు. అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదమూ ఉండదని, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు, ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మధిర పట్టణంలో ఉన్న 6వేలకు పైగా ఉన్న గృహాలకు డ్రైనేజీ నిర్మాణంతో మేలు జరుగుతుందని మురుగునీటిని శుద్ధి చేయడానికి నాలుగు ఎస్‌టీపీ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని మునిసిపాలిటీలో మొక్కలకు, వ్యవసాయానికి వాడుకోవచ్చన్నారు. ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని, తరువాత ఐదేళ్ల సంబంధిత ఏజెన్సీనే నిర్వహణ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్డీఓ నరసింహారావు, మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ డీఈ నరేష్‌రెడ్డి, మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న భట్టి

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

కలెక్టర్‌కు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

వైరా, మే 4(ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లా అధికారులను ఆదేశించారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి ఆదివారం ఉదయం వైరా మండలంలోని తమ స్వగ్రామమైన స్నానాలలక్ష్మీపురంలో పర్యటించిన భట్టి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు తమ గోడును డిప్యూటీ సీఎంకు విన్నవించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని, (మిగతా 6వ పేజీలో)



బోనకల్‌లో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

- భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, మే4(ఆంధ్రజ్యోతి): బోనకల్ మండలంలో సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం నుంచి 16 వరకు రెండు బృందాలతో మండలంలోని అన్ని పంచాయతీలో ఈ సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఒక బృందానికి బోనకల్ తహసీల్దార్, రెండో బృందానికి మధిర తహసీల్దార్ నేతృత్వం వహిస్తారని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బోనకల్ మండలం గార్లపాడు పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు జరుగుతుందని తెలిపారు. భూ సమస్యలు ఉన్న రైతులు లిఖితపూర్వకంగా అందజేయాలని అదనపు కలెక్టర్ కోరారు.

సరిహద్దు దాటుతున్న ఇసుక దందా

- ఆంధ్రా నుంచి భారీగా ఇసుక అక్రమ రవాణా
- లారీలు, టిప్పర్లలో సతుపల్లి ప్రాంతానికి తరలింపు
- అర్ధరాత్రి అన్‌లోడ్.. ఉదయానికి అంతా గప్‌చుప్
- నెలల తరబడి సాగుతున్న దందా
- భారీగా ముడుపులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి



ఆంధ్రా నుంచి సత్తుపల్లికి చేరిన ఇసుక

సత్తుపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): గత కొద్ది నెలలుగా ఏపీ నుంచి ఖమ్మం జిల్లా సత్తుపల్లి పరిసర మండలాలకు భారీస్థాయిలో ఇసుక అక్రమ రవాణా అవుతోంది. ఈ అక్రమ రవాణా బహిరంగ రహస్యమే అయినా అధికారులెవరూ చర్యలు తీసుకోకపోవటం వెనుక భారీ తతంగమే నడుస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అరకొరగా దాడులు జరుగుతున్నా.. అవి కంటితుడుపు చర్యలేనని పలువురు విమర్శిస్తున్నారు. ఆంధ్రా నుంచి అక్రమంగా తరలివస్తున్న ఇసుక వ్యాపారం వెనుక పలువురు పలుకుబడి కలిగిన వ్యక్తులతో పాటు ఆర్థిక లావాదేవీలు కూడా సాగుతున్నాయనే విమర్శలున్నాయి.

విజయవాడ, రాజమండ్రి నుంచి..

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల నుంచి వ్యాపారులు భారీగా ఇసుకను అక్రమంగా తరలించి ఇక్కడ వ్యాపారం సాగిస్తున్నారు. ప్రధానంగా ఏపీలోని నలుగురు వ్యక్తులు సత్తుపల్లి ప్రాంతంలో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని అన్ని స్థాయిల్లో మేనేజ్ చేసుకొని ఇసుక వ్యాపారం యథేచ్ఛగా సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యాపారంలో భారీ స్థాయిలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సత్తుపల్లి పరిసర మండలాల్లో జరుగుతున్న నిర్మాణాలకు ఏపీ నుంచి అక్రమంగా వచ్చిన ఇసుకనే (మిగతా 6వ పేజీలో)

పోలీసుల అదుపులో మూడు ఇసుక టిప్పర్లు

ఎస్కార్ట్‌గా వస్తున్న మూడు కార్లు కూడా 7

రాజలాంఛనాలతో రామయ్యకు పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఆదివారం శ్రీరామ పట్టాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 9న శ్రీరామనవమి శ్రీరామపునర్వసు దీక్షను స్వీకరించిన భక్తులు శనివారం ఆ దీక్ష విరమణ చేశారు. ఈ సందర్భంగా మరుసటి రోజు పట్టాభిషేకం నిర్వహించడం సంప్రదాయం.

ఘనంగా పట్టాభిషేకం

శ్రీరామ పట్టాభిషేకానికి ముందుగా ఆరాధన వేద స్వస్తితో కార్యక్రమానికి శ్రీకారం చుట్టి విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేక మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన వైభవంగా నిర్వహించారు. ఈ సమయంలో పట్టాభిషేక ఘట్టాన్ని రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. ముందుగా స్వర్ణ పాదుకలు, రాజదండం, రాజ ముద్రిక, ఛత్రము, చామరం సమర్పించి పట్టాభిషేకంకు చిహ్నాంగా భక్తుల జయ జయ ధ్వానాల మధ్య కిరీటధారణ చేశారు. పట్టాభిషేకం కార్యక్రమ ముగింపు సందర్భంగా చతుర్వేద పఠనం చేసి ఆ తరువాత పుష్కర నదీ జలాల మహాకుంభ తీర్థ ప్రోక్షణంతో భక్తజనాన్ని పావనం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, అర్చకులు అమరవాది శ్రీకాంతాచార్యులు, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, వేద పండితులు వేనూతుల ఆంజనేయ వరప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

తిలకించిన శ్రీరామ దీక్షాధారులు

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు



ఖమ్మం కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, దీనికోసం రాష్ట్ర జేఏసీ ఉద్యమాలను విజయవంతం చేసేందుకు ఖమ్మం జిల్లా తరపున కృషిచేస్తామని జిల్లా టీజీఈజేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఖమ్మం జిల్లాలో జరిగిన ఉద్యోగ సదస్సు, ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి ఉద్యోగుల ఐక్యతను చాటామన్నారు. రాష్ట్ర జేఏసీ కార్యాచరణ మేరకు మే 15 నుంచి జరిగే నిరసన కార్యక్రమాలను జూన్ 9న జరిగే రాష్ట్ర స్థాయి మహా ధర్నాకు ఖమ్మం జిల్లా ఉద్యోగుల పక్షాన పూర్తిస్థాయిలో విజయవంతానికి కృషి చేస్తామన్నారు. ఖమ్మం జిల్లా టీజీఈ జేఏసీ కన్వీనర్ కస్తాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వారిలో ఉన్న అసంతృప్తి, ఆవేదన ఖమ్మం జిల్లా ఉద్యోగుల సదస్సులో బహిర్గతమైందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్టీవోస్ జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాస్, టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, వాసిరెడ్డి శ్రీనివాస్, డాక్టర్. పి.విజయ్‌కుమార్ సూరంపల్లి రాంబాబు, గోపాలకృష్ణ బుర్రి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్

సింగరేణి మెడికల్ బోర్డులో పెచ్చుమీరిన అవినీతి

- 20న బొగ్గు గనుల్లో దేశ వ్యాప్త సమ్మె
- ఏఐటీయూసీ సింగరేణి ప్రధాన కార్యదర్శి రాజకుమార్

ఇల్లెందు మే 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మెడికల్ బోర్డులో అవినీతి పెచ్చుమీరిందని, విజిలెన్స్ విభాగం నిరుపయోగంగా మారిందని కార్మిక చట్టాలను బొగ్గు పరిశ్రమను కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా 20న బొగ్గు గనుల్లో ఒక రోజు సమ్మెకు పూనుకుంటున్నట్టు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజకుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ బోర్డులో అనారోగ్యంతో విధులు చేయలేని కార్మికులు ఆరోగ్యంగా ఉన్న కార్మికులు రూ.7 లక్షల చొప్పున లంచాలు ముట్టజెపితేనే అన్‌ఫిట్ చేస్తున్నారని ఆరోపించారు. విజిలెన్స్ విభాగం నిరుపయోగంగా మారిందని తెలిపారు. ఇల్లెందు జేకే 5 ఓసీలో ఓబీతో పాటు బొగ్గు సైతం పర్మినెంట్ సింగరేణి కార్మికులతోనే తీయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల కార్మికుల సమ్మె జరుగుతుందని సింగరేణిలో కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కే సారయ్య కార్యదర్శి అజ్మీరా కిషోర్ ఏరియాల నాయకులు రామస్వామి, రమణమూర్తి, ఎస్‌కే నజీర్, ఎస్ రవి, బంధం నాగయ్య, దేవరకొండ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంలో అవినీతి కంపు

- పారిశుధ్య నిర్వహణలో బినామీ కార్మికులు
- ఏళ్లుగా బదిలీ కాని జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు
- పబ్లిక్ హెల్త్ వర్కర్ల స్థానంలో మరొకరు విధులు
- రోజురోజుకు బయటపడుతున్న జాబితా
- విచారణ చేస్తాం : సాంబయ్య, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్



ఖమ్మం సంక్షేమ విభాగం, మే 4 (ఆంధ్రజ్యోతి):ఖమ్మం నగరాన్ని పరిశుభ్రం చేసేందుకు నగర పాలక సంస్థలో పని చేసేందుకు ఏర్పాటు చేసిన పారిశుధ్య విభాగంలోనే అవినీతి కంపు బయటపడుతోంది. రోజు రోజుకు బినామీ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. ఖమ్మం నగర పాలక సంస్థలో పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా ఉద్యోగాలు పొంది. గతేడాదిగా విధులకు హాజరు కాకుండా వారి స్థానంలో బంధువులు, కార్పొరేటర్ అనుచరులను పెట్టుకోవటం అందుకు జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సైతం సహకరించటంతో కేఎంసీలో అవినీతికి అధికారికంగా అండదండలు అందుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.12వేల వేతనాలతో బినామీ కార్మికులు

ఖమ్మం నగర పాలక సంస్థలో పనిచేసే పబ్లిక్ హెల్త్ వర్కర్లకు ప్రతి నెలా రూ.వేలాదిగా వేతనాలు పొందుతున్నారు. అయితే ఇటీవల కాలంలో కొంత మంది పబ్లిక్ హెల్త్ వర్కర్లు తాము చేసే పనులను తమ బంధువులు, లేదా స్థానిక కార్పొరేటర్‌కు అనుకూలంగా ఉండే వారితో చేయిస్తున్నారు. ఇలా పని చేసిన కార్మికులకు నెలకు రూ.12వేలు అందిస్తున్నారు. సహకరించినందుకు గాను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లుకు ఎంతో కొంత ముట్టజెపుతున్నారు. త్రీ టౌన్, 42వ డివిజన్, 48వ డివిజన్‌లో ఇటీవల కాలంలో ఇటువంటి బినామీ కార్మికులు వెలుగులోకి రావటంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విచారణ సైతం చేపట్టారు. కాగా నగరంలోని 60 డివిజన్లలో రోజు రోజుకు బినామీ కార్మికుల సంఖ్య పెరుగుతుందని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి.

మూడేళ్లకు పైగా కదలని జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

ఖమ్మం నగరంలో పారిశుధ్య విభాగంలో ఎంతో కీలకమైన జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మూడేళ్లకు పైగా బదిలీలు కాలేదు. పూర్వ కమిషనర్ ఆదర్శ సురభి కొంతమందికి బదిలీలు చేసినా.. తిరిగి కార్పొరేటర్ల ఒత్తిడి మేరకు యథాస్థానంలోకి జవాన్లు చేరిపోయారు. కేఎంసీ అధికారుల ఆదేశాల మేరకు డివిజన్లలో పారిశుధ్యం, ఇతర కేఎంసీ పనులకే పరిమితం కావాల్సిన జవాన్ల వ్యవస్థ కార్పొరేటర్లకు అనుకూల వ్యవస్థగా మారిపోయింది. కార్పొరేటర్లు ఇళ్లలో కార్మికులను పనులు చేయించేందుకు పంపటం నుంచి అనేక విధాలుగా కార్పొరేటర్లుకు వ్యక్తిగతంగా జవాన్లు ఉపయోగపడుతున్నారు. దీంతో పట్టుబట్టి మరీ కార్పొరేటర్లకు అనుకూలంగా ఉండే జవాన్లను కదలనివ్వటం లేదని తెలుస్తోంది.

వార్డు ఆఫీసర్లతో కుదరని సయోధ్య

గ్రూప్ 4 ద్వారా ఖమ్మం నగరపాలక సంస్థకు 43 మంది వార్డు ఆఫీసర్లు బాధ్యతలు చేపట్టారు. నగరంలోని 60 డివిజన్లను విభజన చేసి ఒక్కో వార్డు ఆఫీసర్‌కుగా రెండు డివిజన్లు చొప్పున కమిషనర్ అభిషేక్ అగస్త్య కేటాయించారు. క్షేత్రస్థాయిలో వార్డు ఆఫీసర్లు సూచనల మేరకు జవాన్లు పనిచేయాల్సి ఉంటుంది. కాని కొన్ని డివిజన్లలో వార్డు ఆఫీసర్లను జవాన్లు పట్టించుకోవటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి.

విచారణ చేస్తాం : సాంబయ్య, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్

పబ్లిక్ హెల్త్ వర్కర్లు వారికి కేటాయించిన ప్రాంతంలో వారే వచ్చి స్వయంగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఆరోపణలు వచ్చిన ఉద్యోగులపై విచారణ చేపట్టాం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. బినామీ కార్మిక వ్యవస్థను ఎట్టి పరిస్థితిలో ప్రోత్సహించం. జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సహాయం అందిస్తే వారిపై చర్యలు తప్పవు.

బయో హాజరు గయో...

పారిశుధ్య కార్మికులు వీధులు ఊడ్చటం వంటి చేతి పనులు చేయటంతో వారి చేతి వేళ్ల బయో మెట్రిక్ హాజరు నమోదులో సాంకేతిక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బయో హాజరు స్థానంలో సాధారణ హాజర్లు నమోదు చేస్తున్నారు. విధులకు హాజరు కాని కార్మికులను విధులకు హాజరైనట్లు హాజరు రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. ఒక్కో కార్మికుడి నుంచి రూ.1,500 నుంచి రూ.4వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. ఈ తరహా దందాలో జవాన్ల సంఘాల నాయకులు ఉన్నట్లు ఎన్నో ఏళ్లగా బహిరంగ చర్చలు జరుగుతున్నాయి. కానీ అధికారులు మాత్రం చర్యలు తీసుకునేందుకు సహకరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ముగిసిన ఎప్‌సెట్ పరీక్షలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/ఖమ్మం ఖానాపురంహవేలి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్-2025 పరీక్షలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం ముగిశాయి. భద్రాద్రి జిల్లాలో సుజాతనగర్ మండలంలోని అబ్దుల్‌కలాం ఇంజనీరింగ్ కళాశాల, పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల రెండు పరీక్షా కేంద్రాలుగా నిర్ణయించి ఐదు రోజుల పాటు ఎప్‌సెట్ పరీక్షలు నిర్వహించారు. తొలి రెండు రోజులు అగ్రికల్చర్, బీ ఫార్మసీ విభాగానికి చివరి మూడు రోజులు ఇంజనీరింగ్ విభాగాలకు ఈ పరీక్షలు నిర్వహించారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 1888 మంది విద్యార్థులు పరీక్ష హాల్ టిక్కెట్లు కేటాయించారు. చివరి రోజు అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో తొలిసెషన్‌లో 78 మందికి గాను 76 మంది, రెండో సెషన్‌లో 77 మంది హాజరయ్యారు. అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో తొలి సెషన్‌లో 78 గాను 74 మంది, రెండో సెషన్‌లో 73 మంది పరీక్షలు రాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఈ ఎప్‌సెట్ పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత నడుమ నిర్వహించామని పరీక్షా కేంద్రాల యాజమాన్యాలు వెల్లడించాయి.

తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి మే 4 వరకు టీసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరీక్షలు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సులలో ప్రవేశానికి నిర్వహించారు. ఏప్రిల్ 29, 30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు, మే 2, 3, 4 తేదీలలో ఇంజనీరింగ్ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి, మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు సెషన్‌లుగా నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 9 పరీక్షా కేంద్రాలలో మొత్తం విద్యార్థులు 15,192 మంది విద్యార్థులకు గాను 14,242 మంది పరీక్షలకు హాజరై, 950 మంది పరీక్షలకు గైర్హాజరైనట్టు తెలిసింది.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్ మే 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 17 వరకు జనగాంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా నెట్‌బాల్ జట్లను ఆదివారం పెద్ద వెంకటగిరి ప్రభుత్వ పాఠశాలలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 58 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రెటరీ ఫణికుమార్ ప్రకటించారు. ఎంపికలను జిల్లా నెట్‌బాల్ సంఘ బాధ్యులు దీప్తి, అఖిల్, పీడీ రమణ తదితరులు సమీక్షించారు.



ఎంపికైన బాలికల జట్టు



ఎంపికైన బాలుర జట్టు

ప్రశాంతంగా నీట్ పరీక్ష

(5వ పేజీ తరువాయి)

తుంగతుర్తి మండలం, మంచానాయక్ తండకు చెందిన బానోత్. సరిత, ఆమె కుమార్తె కావేరి నీట్ పరీక్ష రాశారు. తల్లి సరిత సూర్యాపేటలో పరీక్ష రాయగా కుమార్తె కావేరి ఖమ్మంలో పరీక్ష రాసింది.

కొత్తగూడెంలో 1,058 మంది హాజరు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సంబంధించి పాల్వంచ, కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన నీట్ మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,115మంది విద్యార్థులకుగాను 1,058 మంది పరీక్షకు హజరయ్యారు. 57మంది గైర్హాజరైనట్లు నీట్ పరీక్షల కో-ఆర్డినేటర్ డాక్టర్ టీ.జగన్‌మోహన్ రాజు పర్యవేక్షించారు.



హాల్‌టికెట్ నెంబరు చూసుకుంటున్న విద్యార్థినులు

'భూ భారతి' కరుణించేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ భూముల అక్రమ నమోదులు సైతం రద్దు చేసే అధికారాలను రెవెన్యూ అధికారులకు కల్పించనట్లు రెవెన్యూ సదస్సుల్లో వివరించారు. ఐతే వీటి అమలు మండలాల స్థాయిలో రెవెన్యూ అధికారుల చిత్తశుద్ధిపైనే ఆధారపడి ఉందనడం అతిశయోక్తి కాదు.

ఏజెన్సీ ప్రాంతాల్లో కత్తిమీద సామే

భూ భారతి చట్టం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా నివసిస్తున్న గిరిజన-గిరిజనేతర రైతుల భూ వివాదాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందా లేదా అన్న సంశయం సర్వత్రా నెలకొంది. ఏజెన్సీ ప్రాంతాల్లో వేలాది మంది రైతులు గిరిజన చట్టాల మూలంగా దళారుల బ్లాక్‌మెయిలింగ్‌లు, కొందరు రాజకీయ నాయకులు, కొందరు ప్రజాప్రతినిధులు చేస్తున్న బెదిరింపులతో తల్లడిల్లుతున్నారన్నది కాదనలేని సత్యం. 1/70 చట్టం అమలులోకి రాకముందే తాతముత్తాతల కాలం నుంచి ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులతో పాటు సహజీవనం సాగిస్తున్న గిరిజనేతరులు వారి వారసులు నేటికీ భూములపై సంపూర్ణ హక్కులు లేక కనీసం నివేశన స్థలాలపై సైతం హక్కులు లేకుండా ద్వితీయ శ్రేణి పౌరులుగా జీవిస్తున్నారన్న ఆవేదన నెలకొంది. తమకు ఓటు హక్కు తప్ప స్వేచ్ఛగా జీవించలేని దుర్భర పరిస్థితుల్లో ఉంటున్నామన్న ఆవేదన గిరిజనేతరుల్లో నెలకొంది. అటువంటి గిరిజనేతరుల భూ సమస్యలకు భూ భారతి ఎలాంటి పరిష్కారం చూపుతుందన్న ఉత్కంఠత సర్వత్రా నెలకొంది. ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ ప్రజలను వారి సంస్కృతిని కాపాడేందుకు 1/70, పెసా లాంటి చట్టాలు అమలులో ఉన్నాయి. పోడు భూములకు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల జారీ మొదలుకుని అటవీ ప్రాంతాలపై ఆదివాసీ గిరిజనులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్న విషయం విధితమే. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరుల నడుమ భూ క్రయ విక్రయాలు నిషేధించబడటం, గిరిజనుల భూములు గిరిజనేతరులు కొనుగోలు చేయడం నిషేధించబడింది. ఐనా పేద గిరిజన-గిరిజనేతరుల నడుమ తమ కుటుంబాల ఆర్థిక అవసరాలకోసం పిల్లల చదువులు, ఆడబిడ్డల వివాహాల నిమిత్తం కొంత మేర సాదాబైనామాల ద్వారా క్రయవిక్రయాలు జరిగాయి. గిరిజనులు కొనుగోలు చేసిన భూములకు రిజిస్ట్రేషన్‌లు జరిగినా గిరిజనేతరులకు సాదాబైనామాల ద్వారా రిజిస్ట్రేషన్లు అమలు కాలేదు. ఐనా భూములు సాగుచేసుకుంటూ వేలాది మంది గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాల్లో జీవిస్తున్నారు. ఏజెన్సీలో గిరిజనేతర రైతులపై ఇదే అదునుగా భావిస్తున్న దళారులు కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు వారిని బ్లాక్‌మెయిల్ చేయడం, లక్షలు దండుకోవడం, డబ్బు ఇవ్వని వారిపై ఫిర్యాదులు చేయడం ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయించడం వంటి ఘటనలు జిల్లాలో అనేకం ఉన్నాయి. ఏజెన్సీ మండలాల్లో గిరిజన-గిరిజనేతరుల నడుమ భూ వివాదాలు, ఫిర్యాదులు, ఎల్‌టీఆర్ నోటీసుల జారీలు నిత్య కృత్యంగా మారాయి. ఇటువంటి కీలక వివాదాంశాలు జటిలమైన సమస్యల పరిష్కారం భూ భారతి ద్వారా సాధ్యమవుతుందా లేదా అంటూ గిరిజనేతర రైతులు ఎదురుచూస్తున్నారు. ఐతే గతంలో జరిగిన క్రయవిక్రయాల మూలంగా గిరిజన-గిరిజనేతరులు కొందరు నిజాయితీగా పాత ఒప్పందాలకు సాదాబైనామాలకు కట్టుబడి ఉంటుండగా మరి కొందరు భూములపై వివాదాలు లేవనెత్తుతుండటంతో ఏజెన్సీ మండలాల్లో ఉద్రిక్తతలు, ఘర్షణలు తలెత్తుతున్నాయి.

భూ భారతిపైనే భారం

ప్రభుత్వం అమలులోకి తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రధానంగా గిరిజనేతరుల భూ సమస్యలు జటిలంగా ఉండటంతో రెవెన్యూ సదస్సుల్లో గిరిజనేతరుల ప్రశ్నలకు అధికారులు సైతం సరైన సమాధానం ఇవ్వకపోవడం గమనార్హం, మానవీయ కోణంలో ఏజెన్సీ ప్రాంతాల భూ సమస్యలు పరిష్కరించుకోవాల్సి ఉందని జిల్లాస్థాయి ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. తాజాగా అమలు చేస్తున్న భూభారతి కారణంగా గతంలో వివాదాల్లో కూరుకుపోయిన భూములు, సాదాబైనామాల ద్వారా అనుభవిస్తున్న భూములు స్థానిక సర్దుబాట్లు ఒప్పందాలతో సాగులో ఉన్న రైతుల భూములు, క్రయవిక్రయాల అంశాలు మరో పర్యాయం ఏజెన్సీ మండలాల్లో ఘర్షణలకు వివాదాలకు దారి తీస్తాయన్న ఆందోళన సైతం రైతుల్లో వ్యక్తమవుతోంది. తాత-ముత్తాతల కాలంలో జరిగిన క్రయవిక్రయాలు సైతం ఎలాంటి వివాదాలకు దారి తీస్తాయోనన్న ఆందోళన గిరిజనేతరుల్లో వ్యక్తమవుతుంది. ఎల్‌టీఆర్ నోటీసులతో ట్రైబల్ కోర్టుల్లో కూరుకుపోయిన వివాదాల భూములు, తమకు భూములు ఎలా సంక్రమించాయో ఆధారాలు చూపితేనే రిజిస్ట్రేషన్‌లకు, మ్యూటేషన్‌లకు అవకాశం ఉండటంతో గిరిజన చట్టాల చట్రంలో భూభారతి ఎలాంటి పరిష్కారం చూపుతుందోనన్న ఉత్కంఠ ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొంది.

ఏజెన్సీ ప్రాంతాల్లో తరతరాలుగా సహజీవనం సాగిస్తున్న గిరిజన-గిరిజనేతరుల భూ సమస్యలకు మానవీయ కోణంతో భూభారతి ద్వారా ఎలాంటి పరిష్కారాలు చూపుతారోనన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. ఐదు దశాబ్దాలుగా వివాదాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్న ఏజెన్సీ ప్రాంతాల భూ సమస్యలను గిరిజనులకు, గిరిజనేతరులకు నష్టాలు-కష్టాలు కలగని రీతిలో శాశ్వత పరిష్కారం చూపాలని ఏజెన్సీ ప్రాంతాల రైతులు వేడుకుంటున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

(5వ పేజీ తరువాయి)

ప్రతిరోజూ వర్షాలు కురుస్తున్నాయని, తాము నష్టపోతున్నామని రైతులు వాపోయారు. దాంతో స్పందించిన భట్టి విక్రమార్క ఖమ్మం కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు అక్కడి నుంచే ఫోన్ చేసి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్క ఆదేశాలతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి హుటాహుటిన స్నానాలలక్ష్మీపురం చేరుకొని కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి త్వరితగతిన కాంటాలు వేసి మిల్లులకు ఎగుమతి చేస్తామని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చేకూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం

(5వ పేజీ తరువాయి)

ఆయనను స్ఫూర్తిగా తీసుకుని తాను రాజకీయల్లో అంచెలంచెలుగా ఎదిగానన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సామినేని రాఘవులు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, బిక్కసాని నాగేశ్వరరావు, కొదమసింహం పాండురంగాచార్యులు, ఎం.ఎ. రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం పట్టణంలోని విద్యానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎన్‌కేనగర్‌లో ఉన్న కమ్మసేవాసమితి ఆధ్వర్యంలో మిని కళ్యాణ మండపానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కమ్మ సంఘం నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేనిని కమ్మసంఘం ఆధ్వర్యంలో శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం కమ్మసేవా సమితి అధ్యక్షుడు బిక్కసాని నాగేశ్వరరావు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, మాచవరపు కోటేశ్వరరావు, పరుచూరి కృష్ణమోహన్, కాకొల్లు నాగేశ్వరరావు, జేవీఎస్. చౌదరి, వర్ధన్‌రావు, వట్టికొండ సాంబశివరావు, కూచిపూడి జగన్, గొల్లపూడి శ్యాంసుందర్, లగడపాటి రమేష్, వాసిరెడ్డి ప్రసాద్, బుచ్చి రామారావు పాల్గొన్నారు.



కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

సరిహద్దు దాటుతున్న ఇసుక దందా

(5వ పేజీ తరువాయి)

వినియోగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి భారీ స్థాయిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా.. అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఏపీ నుంచి ఇసుక పక్క రాష్ట్రానికి రవాణా చేయకూడదు. ఈ నిబంధనతో పాటు అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. అక్రమంగా ఇసుక రవాణాతో పాటు అంతరాష్ట్ర రవాణా కాగితాలు లేకుండా, వేబిల్లులు లేకపోవటం అన్నింటికీ మించి ఓవర్ లోడ్ కూడా ఉంటోందని చెబుతున్నారు. సాధారణంగా 30 టన్నులు రవాణా చేయాల్సిన లారీలో 40టన్నులకు మించి ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇలా అనేక రకాలుగా అక్రమాలకు పాల్పడుతున్న ఆంధ్రా లారీ యజమానులపై కేసులు నమోదు చేయాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

రూ.36వేలకు 30టన్నులు..

ఆంధ్రా నుంచి సత్తుపల్లి ప్రాంతానికి రవాణా చేస్తున్న ఇసుకను ఈ ప్రాంతంలో 30 టన్నులు రూ.36 వేల చొప్పున విక్రయిస్తున్నారు. వాస్తవంగా వ్యాపారులకు సత్తుపల్లి ప్రాంతానికి చేరే వరకూ సగటున రూ.16వేలే ఖర్చవుతుందని చెపుతున్నారు. కానీ భారీ స్థాయిలో ముడుపులు చెల్లించటంతో పాటు రవాణా, అన్‌లోడ్ తదితర ఖర్చులు కలిపి రూ.36వేలకు విక్రయిస్తున్నారని సమాచారం. వాస్తవంగా మన రాష్ట్రంలో ముఖ్యంగా భద్రాచలం, మణుగూరు ప్రాంతంలో ఇసుక రీచ్‌ల నుంచి అధికారికంగా 30 టన్నులకు రూ.12,500లు ఇసుక డీడీలు చెల్లించి కొనుగోలు చేసే అవకాశం ఉంది. కాని ఆంధ్రా ఇసుక తక్కువ ధర పడుతోందనే కారణంతో వినియోగదారులు కూడా ఆంధ్రా ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. వారి అవసరాలను అక్రమ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.



మధిరలో పట్టుబడిన ఇసుక ఎస్కార్ట్ వాహనాలు

ప్రభుత్వానికి భారీగా నష్టం..

30టన్నులకు మన రాష్ట్రంలో రూ.12,500లు చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ ఆంధ్రా నుంచి సత్తుపల్లి ప్రాంతాలకు పతి రోజు సగటున పది లారీల ఇసుక అక్రమంగా రవాణా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పది లారీలకు రోజుకు రూ.1,25,000ల చొప్పున ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గండిపడుతోంది.

పలు రూట్లలో అక్రమ రవాణా

సత్తుపల్లి పరిసర మండలాలకు ఇసుక ఆంధ్రా నుంచి పలు రహదారుల గుండా రవాణా సాగుతోంది. ముఖ్యంగా విజయవాడ వైపు నుంచి వచ్చే లారీలు, టిప్పర్లు వేంసూరు మండలం కందుకూరు మీదుగా సత్తుపల్లికి, రాజమండ్రి నుంచి వచ్చే వాహనాలు అశ్వారావుపేట, ఏలూరు జిల్లాలోని గురుభట్లగూడెం మీదుగా ఈ ప్రాంతానికి చేరుతున్నాయి. రాత్రి రెండు గంటల సమయానికి ఈ ప్రాంతానికి చేరుకున్న వాహనాలు సత్తుపల్లిలోని ఒక వేబ్రిడ్జిలో కాంటా వేస్తారు. అక్కడ సీసీ కెమెరాలు కూడా లేకపోవటంతో అన్ని వాహనాలు అక్కడే కాంటా వేస్తారు. ముందుగా ఇసుక ఎవరికి అవసరం ఉందో వారు ఏజంటును సంప్రదిస్తే వారు ఇసుక వ్యాపారులకు సమాచారం ఇస్తారు. భారీ కట్టడాల వద్దకు రాత్రి సమయాల్లో లారీలో వచ్చిన ఇసుకను అన్‌లోడ్ చేసి పోతున్నట్లు సమాచారం.

లారీకి రూ.5వేల చొప్పున మామూళ్లు

ఏపీ నుంచి వస్తున్న ప్రతి లారీ, టిప్పర్ రూ.5వేల చొప్పున మామూళ్ల కింద పక్కన పెడుతున్నట్లు చెబుతున్నారు. రోజు సగటున పది లారీల ఇసుక వస్తే రూ.50వేలు చెల్లింపులకు సరిపోతాయని తెలుస్తోంది. రోజు భారీ స్థాయిలో చెల్లింపులు జరుగుతున్నట్లు సత్తుపల్లిలో బహిరంగంగానే చర్చ సాగుతోంది. ఇంత భారీ స్థాయిలో అక్రమ రవాణా సాగుతున్నా కొన్ని శాఖ అధికారులు మాత్రం 'వాల్టా' చట్టం ప్రకారం వీటిని నియంత్రించాల్సింది తాము ఒక్కరమే కాదని పలుశాఖల సిబ్బంది, అధికారులు ఉన్నారని, ఎవరికి వారు పట్టించుకోవటం లేదనే విమర్శలున్నాయి. మొత్తంగా ఆంధ్రా ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి పూర్తి స్థాయిలో నిజాయితీగా విచారణ జరిపితే అనేక అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. దీనితో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా ఆదాయం చేకూరే అవకాశం ఉంది.

షికారు.. ఆశలపై నీళ్లు

- పాలేరు జలాశయంలో రొయ్యల వేట లేనట్టే
- కార్ప్ జాతి చేపలతోనే సరి
- వెయ్యి మత్స్యకారుల కుటుంబాల ఉపాధికి దెబ్బ
- సుమారు రూ.5కోట్లకుపైగా నష్టం

కూసుమంచి, మే 4(ఆంధ్రజ్యోతి): పాలేరు జలాశయంలో ఈయేడు కూడా జలపుష్పాల లేమితో వెలవెలబోయింది. జలాశయంలో రొయ్య, కొర్రమేను, మార్పు పిల్లల విడుదల నిలిపివేయడంతో జలాశయాన్ని నమ్ముకుని బతుకుతున్న సుమారు వెయ్యికుటుంబాల ఆదాయానికి భారీగా గండిపడింది. సుమారు రూ.5కోట్ల విలువైన ఆదాయాన్ని కోల్పోయారు. గత ఏడాది ఆగస్టు నెలలో చేపపిల్లలను వదిలేందుకు పాలేరు వచ్చిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి జాలర్లు తీసుకెళ్లగా వెంటనే ప్రతిపాదనలు పంపాలని, రొయ్య


మంచినీటి రొయ్యలు

పిల్లలను వదిలేవిధంగా కృషిచేయాలని చెప్పినా మత్స్యశాఖ అధికారుల పట్టించుకోలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దశాబ్దాల కాలంగా పాలేరు జలాశయానికి మంచినీటి రొయ్యలకు ప్రసిద్ధి. దీంతో ఏటా వర్షాకాలంలో రొయ్య, కార్ప్ జాతికి చెందిన చేపపిల్లలు పిల్లలను వదిలేవారు. ఈయేడు రొయ్యపిల్లలను వదలక పోవడంతో ఉపాధి కోల్పోవలసి వచ్చింది. ఏప్రిల్ నెలలో పాలేరు జలాశయం నుంచి సాగర్ ఆయకట్టుకు నీటిని నిలిపివేసిన అనంతరం షికారు మొదలవుతుంది. సుమారు నాలుగు నెలలు వేట సాగుతుంది. ఖమ్మం జిల్లా మత్స్యకారులే కాకుండా పరిసర సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన మత్స్యకారులు కూడ ఇక్కడ చేపల, రొయ్యల వేట సాగిస్తుంటారు.

జలాశయంలో పెంచే తెల్ల చేపపిల్లల ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. రొయ్యపిల్లలను గత మూడేళ్లక్రితం వరకు ఆంధ్రప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్, సొంత ఖర్చుతో వెచ్చించి వదులడం ఆనవాయితీగా వస్తుంది. ఏటా సుమారు 40 బండ్లలో 10లక్షల స్కాంబియా రకానికి చెందిన రొయ్యపిల్లలను (రూ.20లక్షలు) వదులుతుంటారు. ఇవి పెరిగిన అనంతరం వేటాడే సమయంలో రొయ్యలను మత్స్యసొసైటీతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జాలర్లు కాంట్రాక్టర్‌కే విక్రయించేవారు. ఏ-గ్రేడ్ రకం రొయ్యలను రూ.250కు, బీ-గ్రేడ్‌రకం 150కు విక్రయిస్తుంటారు. కానీ ఎగుమతులు సరిగా లేకపోవడంతో ఆంధ్ర కాంట్రాక్టర్ రొయ్య పిల్లలు వదలడం లేదు.

మత్స్యశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం

మత్స్యశాఖ అధికారుల తీరుపై జాలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ అభ్యున్నతికి పాటుపడాల్సిన అధికారులు అక్రమాలకు పాల్పడుతుండటంతో ఈయేడు చేపపిల్లలే విడుదల చేయకుండా నిలిపివేశారని ఆరోపిస్తున్నారు. కేవలం తెల్లచేపపిల్లలను మాత్రమే వదిలి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. .


పాలేరులో అరకొరగా సాగుతున్న చేపల వేట

రొయ్య, చేపపిల్లలను ప్రభుత్వమే వదలాలి

బత్తుల ఉప్పయ్య మత్స్యకారుడు, పాలేరు

పాలేరు జలాశయంలో ఈయేడు రొయ్యపిల్లలను వదలకపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. కాంట్రాక్టర్‌పై ఆధారపడటం వలన ఈపరిస్థితి ఎదురైంది. ఒక్కో కుటుంబం రూ.లక్ష వరకు నష్టపోయాం. చేపల పిల్లలను ప్రభుత్వం అన్ని చెరువుల్లో వదులుతున్నప్పటికీ పాలేరు జలాశయంలో రొయ్య, కొర్రమేను పిల్లలను వదలాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వమే రొయ్యపిల్లలను వదిలి తమ ఆర్థికాభివృదికి కృషిచేయాలి.

సొసైటీ కార్యదర్శి సస్పెన్షన్‌కు సిఫారసు

- కుర్నవల్లిలో మహాజన సభ తీర్మానం లేకుండా రైస్‌మిల్లు
- గత నెలలో ఈదురు గాలులకు కూలిన షెడ్


కూలిపోయిన కుర్నవల్లి సొసైటీ రైస్‌మిల్లు షెడ్డు

తల్లాడ, మే4 (ఆంధ్రజ్యోతి): నాబార్డు నిధులతో సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన రైస్‌మిల్లు నిర్మాణం మహాజన సభ తీర్మానాలు లేకుండా నాణ్యతాలోపంతో జరిగిందని, దీనికి బాధ్యుడిని చేస్తూ తల్లాడ మండలం కుర్నవల్లి సొసైటీ కార్యదర్శి ఒగ్గు నరసింహారెడ్డి సస్పెన్షన్‌కు జిల్లా సహకారశాఖ జాయింట్ రిజిస్ట్రార్ ఎశ్రీనివాస్ సిఫారసు చేశారు. 2023లో రూ.2కోట్ల నాబార్డు నిధులతో సొసైటీ ఆధ్వర్యంలో రైస్‌మిల్లు నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం కుర్నవల్లి గ్రామంలో రూ.41.62లక్షలతో ఒక ఎకరం 33కుంటల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఈ స్థలంలో రైసుమిల్లు నిర్మాణంలో భాగంగా రూ.51.80 లక్షలతో రేకులషెడ్లు, మరో రూ.41.43లక్షలతో సివిల్ నిర్మాణ పనులు చేపట్టారు. గతనెల 13వ తేదీన ఈదురు గాలులతో కురిసిన భారీవర్షానికి రేకుల షెడ్డుకూలిపోయింది. గతనెల 24వ తేదీన కుర్నవల్లి గ్రామంలో పర్యటిచిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కూలిపోయిన రైస్‌మిల్లు షెడ్డును పరిశీలించారు. నాణ్యతలోపం వల్ల రైస్‌మిల్లు షెడ్డు కూలి పోయిందని కలెక్టర్‌కు కొందరు స్థానికులు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్పందించి ఈవిషయమై విచారణ జరపాలని జిల్లా సహకారశాఖ అధికారిని ఆదేశించారు. విచారణలో సొసైటీ మహాజనసభ తీర్మానాలు లేకుండా రైస్‌మిల్లు స్థలం కొనుగోలు , రైస్‌మిల్ నిర్మాణ పనులు చేపట్టినట్టు నిర్ధారణ కావడంతో ఇందుకు బాధ్యుడైన సొసైటీ కార్యదర్శి ఒగ్గు నరసింహారెడ్డిని సస్పెండ్ చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. సొసైటీ పాలకవర్గం సమావేశం నిర్వహించి కార్యదర్శిని సస్పెండ్ చేయాలని జాయింట్ రిజిస్ట్రార్ ఆదేశించారు.



కాసుపత్రులు

అర్హత, అనుమతి లేకుండానే ఆపరేషన్లు

- వసతులులేని అసుపత్రులపై చర్యలు ఏవీ?
- నిబంధనలకు విరుద్ధంగా వైద్యం
- పట్టించుకోని వైద్య శాఖ అధికారులు
- గాలిలో కలుస్తున్న ప్రాణాలు

సత్తుపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): సరైన నిబంధనలు పాటించకుండా ప్రైవేటు ఆస్పత్రుల ఏర్పాటు, అనుమతులు లేకున్నా ఆపరేషన్లు చేయటం తదితర కారణాలతో సత్తుపల్లి దవాఖానాల్లో ఇటీవల కొందరు రోగుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఆపరేషన్లు, వైద్య చికిత్స వికటించి చనిపోవటం ఆ తరువాత పట్టణంలో కొందరు ప్రైవేటు వైద్యులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు రంగంలోకి దిగి బాధిత కుటుంబాలతో సెటిల్‌మెంట్ చేయటం పరిపాటిగా మారింది. సంఘటన జరిగిన తరువాత బాధిత కుటుంబాల వారు ఆందోళన చేయటం సెటిల్‌మెంట్ జరిగేవరకూ అధికారులు ప్రేక్షకపాత్ర వహించి ఆ తరువాత తమకు ఫిర్యాదు లేదంటూ తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు వైద్యులు కాసులకు కక్కుర్తి పడి అర్హత లేకున్నా ఆపరేషన్లు చేస్తున్నారు.

అర్హత లేకున్నా ఆపరేషన్..

సత్తుపల్లి యాక్సిస్ బ్యాంకు సమీపంలోని ఒక ఆస్పత్రిలో నిబంధన మేరకు ఆపరేషన్లు చేసే వీలు లేదు. అయినా ఆస్పత్రి బోర్డుపై మాత్రం ఎమర్జెనీ, జనరల్ మెడిసిన్, సర్జరీ అని రాయించారు. మూడు రోజుల క్రితం అక్కడి వైద్యుడు ఒక వివాహితను చేర్చుకొని అమెకు వేరే జనరల్ సర్జన్ సాయంతో ఆపరేషన్ చేయటంతో వికటించి ఆమె మృతి చెందింది. కేవలం ఎంబీబీఎస్ వైద్యుడు ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో ఆపరేషన్లు చేసేందుకు వీలు లేదు. అయినా ఆపరేషన్ థియేటర్‌ను రేకుల షెడ్డులో ఏర్పాటు చేసి మరీ ఆపరేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఎప్పటి నుంచో వినవస్తున్నాయి. ఆపరేషన్ అనంతరం మహిళ పరిస్థితి విషమించటంతో ఆమెకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తే బతికే అవకాశం ఉండేదని అంటున్నారు. కాని ఈ ఆసుపత్రిలో అలాంటి సౌకర్యాలు ఏమీ లేవు. కాగా ఆస్పత్రిలో ఆపరేషన్‌కు అనుమతులు లేవని వైద్య ఆరోగ్య శాఖ అధికారి ధ్రువీకరించారు.

ప్రాణాలు పోయాక తీరిగ్గా విచారణ..

ఆసుపత్రుల్లో అనుమతులు లేకుండా వైద్యం, అపరేషన్ల థియేటర్ల ఏర్పాటు, అర్హత లేని వైద్యులు ఆపరేషన్లు చేయటం లాంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులు ఏమి చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆస్పత్రుల్లో మరణాలు సంభవించి ఆందోళనలు, పత్రికల్లో కథనాలు వెలువడిన సమయంలో అధికారులు విచారణల పేరుతో వచ్చి వెళుతున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటి వరకూ విచారణలే కాని తీసుకున్న చర్యలు మాత్రం లేవనే పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాధిత కుటుంబాల నుంచి ఫిర్యాదులు లేవనే కారణం చూపి అధికారులు తమ బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తనిఖీలు శూన్యం

ఆసుపత్రులను అధికారులు తరచూ తనిఖీ చేసి అసుపత్రులకు ఉన్న అనుమతులు, ఆపరేషన్ థియేటర్లు, ఆసుపత్రులలో అందుబాటులో ఉంటే వైద్యుల పేర్ల డిస్‌ప్లే, అందించే వైద్య సేవలు తదితర వివరాలు పరిశీలించాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధగా ఉన్న క్లినిక్‌లపై చర్యలు తీసుకునే అధికారం ఉంది. కాని వరుస సంఘటనలు జరుగుతున్నా సత్తుపల్లిలో ఆస్పత్రులను సందర్శించిన అధికారులు లేకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది.

సెటిల్‌మెంట్ల దందా...

రోగులు ప్రాణాలు పోతున్నా కొందరు వైద్యులు మాత్రం సెటిల్‌మెంట్లు చేసుకుంటూ కుటుంబంతో పాటు ఎవరికి ఎంత ముట్ట జెప్పామో బహిరంగంగానే చెపుతున్నారు. ఇందులో భాగంగా మూడు రోజుల క్రితం సంఘటన జరిగిన ఆసుపత్రికి సంబంధించిన వైద్యుడు మాత్రం బాధిత కుటుంబంతో పాటు కొందరు అధికారులు, అనధికారులకు ఒక ప్రైవేటు వ్యక్తి ద్వారా నగదు అందజేసినట్లు ప్రచారం చేయటం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.


ధాన్యం కొనుగోలు కేంద్రంలో ట్యాబ్‌ను పరిశీలిస్తున్న డీఎస్వో చందన్

ధాన్యం కొనుగోళ్ల పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్, మే 4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు తనిఖీ చేశాయి. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు డీఎస్వో చందన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్మెంట్ టీం జిల్లాలో వారికి కేటాయించిన ప్రాంతాల్లో పర్యవేక్షించారు. నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, కొనిజర్ల, సత్తుపల్లి, వైరా, తల్లాడ ప్రాంతంలోని కొనుగోలు కేంద్రాలను తనిఖీచేశారు. కాటా వేసి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని లారీ కాంట్రాక్టర్లతో మాట్లాడి హనుమకొండకు కేటాయించిన మిల్లులకు పంపించారు. మిల్లుల్లో నిలిచిన లారీలను వేగంగా ఆన్‌లోడ్ చేసేందుకు మిల్లు యజమానులతో మాట్లాడారు. మొత్తం 1లక్ష 11 వేలమెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. హన్మకొండ మిల్లులకు ఇప్పటివరకు 2100 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసి పంపించినట్లు తెలిపారు. వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల బాధ్యులకు అప్రమత్తంగా ఉండాలని డీఎస్వో తెలిపారు.

క్రైం కార్నర్

పిడుగుపాటుతో మహిళ మృతి


రాధమ్మ

ఎర్రుపాలెం, మే4 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెంలో ఆదివారం పిడుగు పాటుకు మహిళ మృతిచెందింది. పోలీసుల కథనంప్రకారం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తల్లపురెడ్డి రాధమ్మ(60) గేదెలు మేపడానికి గ్రామశివారులోని తనపొలానికి వెళ్లింది. గేదేలను తోలుతుండగా ఆదివారం ఉదయం పిడుగుపడి అక్కడికక్కడే మృతిచెందింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.రమేష్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఖమ్మం రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన చామకూరి పాపయ్య (70) వడదెబ్బతో ఆదివారం మృతిచెందాడు. పాపయ్య కూలీపనులు చేస్తుంటాడు. శనివారం ఎండతీవ్రతకు వాంతులు, విరోచనాలు అయి వడదెబ్బతో మృతిచెందాడు. ఆయన మృతి విషయం తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, రవీందర్, నాగేంద్ర బాబు, చంద్రశేఖర్ తదితరులు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులర్పించారు.


పురుగులమందు డబ్బాతో మహిళలు

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆందోళన

కారేపల్లి, మే4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని భాగ్యనగర్‌తండాలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని ఆదివారం కొందరు మహిళలు ఆందోళనకు దిగారు. పురుగుల మందు డబ్బాలు చేపట్టి తమకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకుంటే మందుతాగి చస్తామని హెచ్చరించారు. భాగ్యనగర్‌తండాలో పేదలకు కాకుండా, భూస్వాములకు ఇండ్లు ఇస్తున్నారని, ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జోక్యం వెంటనే చేసుకోవాలని అన్నారు. ఇళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, తమ పరిస్థితిని గమనించి ఎమ్మెల్యే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

మధిరరూరల్/ ఏన్కూరు/ జూలూరుపాడు/ చింతకాని, మే4 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు మృతి చెందారు. మధిర రూరల్, ఏన్కూరు, జూలూరుపాడు , చింతకాని మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒక్కొక్కరు మృతిచెందారు.

మధిర మండలంలోని దెందు కూరు వద్ద ఆర్వోబీపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. టాటా ఏస్ వాహనం ద్విచక్రవాహనంను ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది.. ఎర్రుపాలెం మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన మట్టగుంజ సతీష్ (23) మధిరలోని ఓ ఫర్నిచర్ షాపులో పనిచేస్తున్నాడు. రాత్రి 12గంటల సమయంలో ద్విచక్రవాహనంపై మధిరనుంచి స్వగ్రామం తక్కెళ్లపాడుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో దెందుకూరు రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఇతను ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో సతీష్ తలకు, కాళ్లకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డుప్రమాదంలో రామతండా గ్రామానికి చెందిన వివాహిత మృతి చెందిన సంఘటన మండల కేంద్రం ఏన్కూరులో ఆదివారం సాయంత్రం జరిగింది. మండల పరిధిలోని రామాతండా గ్రామానికి చెందిన సోడి యం బ్రహ్మ, భార్య సంధ్య (38) కూతురు అమృతతో కలిసి ద్విచక్ర వాహనంపై ఏన్కూరు బయలుదేరారు. ప్రధాన సెంటర్ దగ్గరకు రాగానే మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుకవైపునుంచి ఢీకొట్టింది. ఈసంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108 ద్వారా ఖమ్మం తరలిస్తుండగా సంధ్య మృతిచెందింది. తండ్రి, కూతురు పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిపారు.

కారు ఢీకొన్న సంఘటనలో గాయపడ్డ ఓ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం ఈ సంఘటనపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని బేతాళపాడు పంచాయతీ పీక్లా తండా గ్రామానికి చెందిన గుగులోత్ బుల్లి(58) మహిళ తన సోదరుడు అయిన బానోత్ కస్నా ద్విచక్ర వాహనంపై ఓ పని నిమిత్తం శనివారం సాయంత్రం పడమటనర్సాపురం గ్రామానికి వెళ్లింది. తిరిగి సోదరుడి ద్విచక్ర వాహనంపైనే వస్తుండగా బేతాళపాడు వైపు వస్తున్న కారు డ్రైవర్ రేగళ్ల తండా గ్రామ శివారులోని కోళ్ల ఫారం వద్ద ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో బుల్లికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు వైద్య చికిత్సలను


మధిర, జూలూరుపాడులో మృతిచెందిన సతీష్, బుల్లి


ఏన్కూరులో మృతిచెందిన సంధ్య

అందించేందుకు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె అర్ధరాత్రి మృతి చెందింది.

ఆర్‌టీసీ బస్సు, కారు ఢీ..

- కారు డ్రైవర్ మృతి, మరొకరికి గాయాలు

ఆర్టీసీ బస్సును కారు ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా మరొకరు గాయపడిన ఘటన చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో ఖమ్మం-బోనకల్ రోడ్డుపై ఆదివారం చోటు చేసుకుంది. ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామానికి చెందిన పుసుపులేటి వెంకటసాయి బ్రహ్మయ్య(23) ఖమ్మంలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు ఆదివారం మిత్రుడు వేపూరి శబరీష్‌తో కలిసి స్వగ్రామంలో ఓ శుభకార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి సాయంత్రం కారులో ఖమ్మం వెళ్తుండగా చింతకాని మండల పరిధిలోని తిరుమలాపురం క్రాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొట్టడంతో కారు నడుపుతున్న పసుపులేటి వెంకటసాయి బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. కారు ముందు సీట్లో కూర్చున్న శబరీష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.


ప్రమాద స్థలంలో వాహనాలు

ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో సుమారు 80 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. బస్సును కారు బలంగా ఢీకొట్టడంతో బస్సు ముందు చక్రం యాక్సిల్ విరిగి బస్సు రోడ్డు పక్కకు దూసుకునిపోయి నిలిచిపోయింది. ఘటన గురించి సమాచారం తెలుసుకున్న ఎస్ఐ నాగుల్ మీరా ఘటన ప్రాంతానికి చేరకుని క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కమ్యూనిస్టు యోధుడు గురుప్రసాదరావుకు ఘన వీడ్కోలు

- వైద్య విద్యార్థుల పరిశోధనకు మృతదేహం మెడికల్ కళాశాలకు అప్పగింత
- నివాళులర్పించిన మంత్రి తుమ్మల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని


సంతాప సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం, మే 4 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు కొత్తగూడెం ప్రాంతానికి చెందిన ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాదరావుకు సీపీఐ, ప్రజాసంఘాల శ్రేణులు, అభిమానులు, న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురుప్రసాద్ వృద్ధాప్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని బంధువుల ఇంట్లో మృతి చెందగా ఆయన మృతదేహాన్ని ఆదివారం పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం కొత్తగూడెంలోని సీపీఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌కు తరలించారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కార్యవర్గసభ్యుడు బి. అయోధ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం పరిసర మండలాల్లో రాజకీయాలను ప్రభావితం చేసిన వ్యక్తి గురు ప్రసాద్ అన్నారు. ఎలాంటి పదవులను ఆశించకుండ కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి చేశారని ఆయన మృతి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలకు తీరని లోటని, అమరనేతల ఆశయాల సాధన దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.

ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ గురుప్రసాదరావు ఉత్తమ కమ్యూనిస్టు అని, తన తుది శ్వాస వరకు ప్రజాసేవకే అంకితమయ్యారని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలను నిర్మించారని అన్నారు. శేషగిరిభవన్ నుంచి కొత్తగూడెం వైద్య కళాశాల వరకు జన సందోహం నడుమ అంతిమయాత్ర జరిగింది. కుటుంబసభ్యుల కోరిక మేరకు గురుప్రసాద్ మృతదేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం కొత్తగూడెం వైద్య కళాశాలకు అప్పగించారు. నివాళులర్పించిన వారిలో లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు వై. ఉదయ్‌భాస్కర్, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్నా లక్ష్మీకుమారి, నరాటి ప్రసాద్, శ్రీనివాసరావు ఉన్నారు.

4కిలోల గంజాయి పట్టివేత

- 12మందిపై కేసు నమోదు

మధిరరూరల్, మే4(ఆంధ్రజ్యోతి): ఒడిసా రాష్ట్రం నుంచి నుంచి మధిరకు గంజాయి తీసుకువచ్చి అమ్ముతున్న ముఠాను మధిర టౌన్‌ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ కొట్టే రుత్విక్‌సాయి ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం మధిర టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 2వతేదీన ఆత్కూర క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా ద్విచక్రవాహనంపై బ్యాగుతో వస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద బ్యాగుల్లో సుమారు రూ.2లక్షల విలువ చేసే నాలుగు కిలోల గంజాయి దొరికినట్టు ట్రైనీఐపీఎస్ తెలిపారు. ఈ గంజాయి ఒడిసా రాష్ట్రంలోని పుష్పలంక ప్రాంతంలోని హంటర్ మధు అనే వ్యక్తి నుంచి ఖమ్మంజిల్లా మధిరకు చెందిన మర్రి సుజిత్, తమ్మిశెట్టి ఏసుబాబు గంజాయిని కొనుగోలు చేసి 9మంది ఉన్న ముఠాకి అమ్ముతున్నారు. వీరంతా ఇన్‌స్టాగ్రాం యాప్ ద్వారా మాట్లాడుకుంటూ గంజాయి రవాణా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మొత్తం 12మంది పై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. మర్రి సుజిత్ తమ్మిశెట్టి ఏసుబాబుని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. బైక్‌ను సీజ్‌చేసినట్టు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

పోలీసుల అదుపులో మూడు ఇసుక టిప్పర్లు

మధిరటౌన్,మే4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లతో పాటు వీటికి ఎస్కార్ట్‌గా ఉన్న మూడు కార్లను పట్టుకుని టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ట్రైనీ ఐపీఎస్, మధిర టౌన్ ఎస్‌హెచ్‌వో రుత్విక్‌సాయి తెలిపారు. శని వారం రాత్రి రాయపట్నం బ్రిడ్జి వద్ద ఏపీ నుంచి ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను పట్టుకున్నారు. ఈ టిప్పర్లకు ఎస్కార్టుగా ఉన్న మూడు కార్లను కూడా అదుపులోకిని తీసుకున్నారు. ఇసుక అక్రమరవాణదార్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడకొని రవాణా చేస్తున్నారని, వారి ఫోన్‌లలో షైవీల్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దానిలో చెక్‌పోస్టులు లేని రూట్‌ను ఎంచుకొని రవాణా చేస్తున్నారు. టిప్పర్ల డ్రైవర్లు ముగ్గురుతో పాటు ఎస్కార్ట్ వాహనంలో ఉన్న ముగ్గురితో పాటు మొత్తం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


పట్టుబడిన ఇసుక టిప్పర్లు



రైతులు గుర్తింపు సంఖ్య పొందాలి: ఏవో రాధ

నేలకొండపల్లి, మే4(ఆంధ్రజ్యోతి):కేంద్రప్రభుత్వం నుంచి రైతులకు వచ్చే సంక్షేమ పథకాలు పొందాలంటే తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో 11అంకెల గుర్తింపు సంఖ్యను పొందాలని నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి ఎం.రాధ చెప్పారు. ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు భూభారతి పోర్టల్‌లో భూమి ఉన్న ప్రతీరైతు ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ లింక్‌అయిన ఫోనుతో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని కోరారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పీఎం కిసాన్ యోజన, ప్రధానమంత్రి పసల్‌బీమా, రాష్ట్రీయ కృషియోజన, భారత ఆహార భద్రత మిషన్ లాంటి పథకాలు పొందాలంటే రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరన్నారు.

జోనల్ ఉద్యోగుల కేటాయింపుపై పునః పరిశీలన

» విమర్శల నేపథ్యంలో కేఎంసీ కమిషనర్ నిర్ణయం

» నేడో, రేపో మరో ఉత్తర్వు జారీకి అవకాశం



ఖమ్మంసంక్షేమవిభాగం,మే4(ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్థానికంగానే నగరపాలక సేవలు అందించాలని ఏర్పాటు చేసిన జోనల్ వ్యవస్థ ఉద్యోగుల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు పూర్తిస్థాయిలో సమాచారం లేకుండానే జోనల్ కార్యాలయాలకు ఉద్యోగుల కేటాయింపు జరిగిందని విమర్శలు వెలువడ్డాయి. వాస్తవానికి ఏప్రిల్30న ఖమ్మంనగరంలోని నార్త్, వెస్ట్ జోన్ కార్యాలయాలకు ఉద్యోగులు కేటాయింపు ప్రక్రియ పూర్తిజరిగింది. అయితే ఉత్తర్వులు తీసుకున్న ఉద్యోగులు ఉలిక్కిపడ్డారు. కేఎంసీ కార్యాలయంలో తిష్టవేసిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జోనల్ వ్యవస్థకు పోస్టింగ్‌లు ఇవ్వలేదు. ఓ వర్గానికి అనుకూలంగా కొంతమంది ఉద్యోగులను ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి కదలకుండా పోస్టింగ్‌లు ఇచ్చిరనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా రెవెన్యూ విభాగం, ఐటీ విభాగంలోని ఒక్క ఉద్యోగిని కేఎంసీ కార్యాలయం నుంచి జోనల్ కార్యాలయానికి కదల్చ లేదు. కేఎంసీ కార్యాలయంలో తిష్టవేసిన అసిస్టెంట్‌లు జోనల్ కార్యాలయానికి పంపలేదు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు సైతం అసిస్టెంట్‌లను పెట్టుకున్నారు. వారిని జోనల్ కార్యాలయానికి పంపలేదు. దీంతో పలు అభ్యంతరాలు రావటంతో కమిషనర్ అభిషేక్ అగస్త్య జోనల్ ఉద్యోగుల కేటాయింపుపై పనఃపరిశీలన చేస్తున్నట్లు సమాచారం.

రోడ్లపైనే కొబ్బరి బొండాలు, గ్రానైట్ వ్యర్థాలు

» పారిశ్రామిక ప్రాంతంలో పట్టించుకోని అధికారులు

» వెలగని వీధి దీపాలు



రహదారి పక్కన పోసిన కొబ్బరి బొండాలు, గ్రానైట్‌రాళ్లు

ఖమ్మంఖానాపురంహవేలి,మే4(ఆంధ్రజ్యోతి): ఖానాపురంహవేలి పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన రహదారుల వెంట కొబ్బరిబొండాలు, గ్రానైట్ వ్యర్థాలను రహదారు వెంట పోస్తున్నారు. నెలరోజులుగా అర్ధరాత్రి సమయాల్లో తీసుకొచ్చి వీటిని వేస్తున్నారు. ఇండస్ట్రీయల్ ఏరియాలో టీఎస్ఐఐసీ(తెలంగాణ స్టేట్‌ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రెచ్చర్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో లక్షలు వెచ్చించిరోడ్లు,డ్రెయిన్లు నిర్మించారు. అధికారులు పట్టించుకోకపోవటంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమలనుంచి ట్యాక్స్‌లు వసూళ్లు చేసే అధికారులు కనీస అవసరాలైన వీధి దీపాలు, మంచినీరు, రోడ్లు, డ్రైనేజీల సమస్యలను తీర్చకుండా ట్యాక్స్‌లు మాత్రం కట్టాలంటూ నోటీసులు పంపుతున్నట్లు పలువురు పరిశ్రమల యజమానులు చెబుతున్నారు.

చిమ్మచీకటిలో ప్రమాదాలు

రాత్రిపూట పరిశ్రలకు రావాలంటే చిమ్మ చీకటిగా ఉంటోందని, కొన్నిసమయాల్లో రోడ్లపై కార్లు, ట్రాక్టర్లు, లారీలు ఆపి ఉండటంతో ప్రమాదాలు సంభవించాయని తెలుపుతున్నారు. కొందరు ఇక్కడ మందు తాగి ఆ బాటిళ్లను రోడ్లపై పగలగొట్టంతో కార్మికులకు గుచ్చుకుంటున్నాయి. దీనిపై టీఎస్ఐఐసీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవట్లేదని పలువురు కార్మికులు చెబుతున్నారు.

అభివృద్ధితో సంబంధంలేదు

ఇండస్ట్రీయల్ ఏరియాలో కేవలం ఆదాయమే మాకు కావాలి, అభివృద్ధితో మాకు సంబంధంలేదనే ధోరణితో టీఎస్ఐఐసీ అధికారులు ఉన్నట్లు తెలుస్తుంది. పారిశ్రామిక ప్రాంతాల పరిశ్రమల యజమానులతో మూడు నెలలకో, ఆరునెలలకో ఓసారి సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి సమస్యలను తీర్చాల్సిన అధికారులు సంవత్సరాల కొద్దీ అటువైపు కన్నెత్తి చూడటం లేదు. కానీ ట్యాక్స్‌లు మాత్రం కట్టాలంటూ నోటీసులు ఇవ్వటంపై పరిశ్రమల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆ ట్యాక్స్‌లు కూడా గతంలో ఓపరిశ్రమకు రూ.19వేలు ఉన్న ట్యాక్స్‌ను ఎటువంటి సమాచారం లేకుండా రూ.90వేలకు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టించుకోని జిల్లా పరిశ్రమల అధికారులు

నూతన పరిశ్రమ పెట్టాలంటే పరిశ్రమల అధికారులు అనుమతి తప్పనిసరి.. పరిశ్రమ అన్ని అనుమతుల పత్రాలను అందించిన తరువాతే వారు పరిశ్రమ పెట్టే స్థలాలను సందర్శించి అనుమతులు మంజూరు చేస్తారు. ఆ తరువాత కనీసఅవసరాలు తీర్చటంలో మాత్రం మాకుసంబంధం లేదనే ధోరణిలో ఉంటున్నారు. ప్రస్తుతం జిల్లా పరిశ్రమల కేంద్రానికి రెగ్యులర్ జీఎం(జనరల్‌మేనేజర్) లేకపోవటంతో సూర్యాపేట జిల్లా జీఎంకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆయన వారంలో ఒకరోజో, రెండు రోజులో అందుబాటులో ఉంటారు. మిగిలిన సమయంలో ఈ కార్యాలయంలో సంభందిత అధికారులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి.

రుద్రాక్ష ప్రదర్శనకు నేడే చివరిరోజు



ఖమ్మంచర్చికాంపౌండ్, మే4 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా ఖమ్మంనగరంలోని బైపాసరోడ్డులోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న నేపాలీ రుద్రాక్ష ప్రదర్శన సోమవారం ముగుస్తుందని నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు. ఈప్రదర్శనలో కరంగళిమాలలు, కటికమాలలు, రుద్రాక్షలు లభిస్తాయని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

త్రివేణి విద్యార్థులను అభినందించిన ఎంపీ



ఖమ్మంఖానాపురంహవేలి, మే4 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన నగరంలోని త్రివేణి పాఠశాల విద్యార్థులను ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం. రఘురాం రెడ్డి అభినందించారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంపీని కలిశారు. ఆయన విద్యార్థులను అభినందించారు.

హైకోర్టు న్యాయాధికారి మృతికి సంతాపం

ఖమ్మంలీగల్, మే4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయాధికారి ప్రియదర్శిని ఆదివారం అకాల మృతికి జిల్లా న్యాయవాదులు సంతాపం తెలిపారు. ఆమె జిల్లా న్యాయాధికారిగా పని చేసిన సమయంలో ఎనలేని సేవలందించారని గుర్తు చేసుకున్నారు. న్యాయాధికారిగా సామాన్యులకు ఎనలేని సేవలందించారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, దిలీప్ కుమార్, వివిధ న్యాయవాద సంఘాల నాయకులు సంతాపంతెలిపారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

తిరుమలాయపాలెం, మే4(ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెం మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీ రఘురాంరెడ్డికి వినతి పత్రం అందించారు. ఎస్సీ గురుకులానికి సొంత భవనం నిర్మించాలని, పబ్లిక్ టాయిలెట్, సెంట్రల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, దాసరి మహేందర్, టినాగేశ్వరరావు, సత్యనారాయణ, వెంకటేష్, నవీన్, వీరబాబు, మహేష్, పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



గోకినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు..



నాయకన్‌గూడెంలో సమావేశమైన పూర్వవిద్యార్థులు



డీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఆర్ఎస్ డిగ్రీకళాశాలలో 2002-2005 విద్యాసంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానకి కళాశాల యాజమాన్యం మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఎగిరే గాలిపటం విద్యార్థి ఐతే దానికి ఆధారమైన దారం గురువు అవుతాడని అన్నారు. పూర్వ విద్యార్థులందరు ఒకేచోట కలుసుకోవటంతో ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

ముదిగొండ మండలం గోకినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1885-86 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. 39సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థుల 32మంది ఒకేచోట కలుసుకోవటంతో వారి ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరిని ఒకరు పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సాగర్, రమేష్, జగదీష్, రామకృష్ణ, సునీత, హరిత తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడె ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. 2000-01 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు సమావేశమై తమ జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తమకు ఉన్నత విద్యాబుద్దులు నేర్పించిన తమ గురువులు పిచ్చయ్య, జయప్రద, అప్పారావు తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బచ్చు శ్రీరాం, తోట అనీల్, దినేష్, ఏడుకొండలు, ఆదినారాయణ, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘సెడార్‌వ్యాలీ’లో వైమానిక శిక్షణ



వైమానిక శిక్షణ తీసుకున్న విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, మే4(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెడార్‌వ్యాలీ పాఠశాలలో స్పేస్‌జెన్ సంస్థతో కలిసి పాఠశాల విద్యార్థులకు ఈనెల2,3 తేదీల్లో వైమానిక శిక్షణ అందించారు. విద్యాసంస్థలకు చెందిన 100 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారని కరస్పాండెంట్ రవిమారుత్, అకాడమిక్ అడ్వైజర్లు పార్వతీరెడ్డి, ఉదశ్రీ తెలిపారు. ఆదివారం పాఠశాలలో కెప్టెన్ విగో విద్యార్థులకు విమానంలోని వివిధమెషీన్లను పరిచయం చేశారు. విమానం టేకాఫ్,లాండింగ్,ఫ్లయింగ్ విభాగాల్లో శిక్షణ అందించారు. కిట్స్ ద్వారా విమానాల విభాగాలను జత చేసి మోడల్ విమానాన్ని తయారుచేసి ఎగురువేశారు. అనంతరం శిక్షణ తీసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

యాదవులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

యాదవ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

ఖమ్మంచర్చికాంపౌండ్, మే4(ఆంధ్రజ్యోతి): యాదవులకు ఇచ్చిన నగదు బదిలీ హామీని నెరవేర్చాలని తెలంగాణ యాదవ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని టీటీడీసీ భవన్‌లో జరిగిన సంఘం జనరల్‌బాడీ సమావేశంలో సంఘం ఖమ్మం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడుగా కోడి లింగయ్య, ప్రధానకార్యదర్శిగా గుమ్మ రోశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారీమల్సూర్, మహిళ విభాగం అధ్యక్షురాలిగా చిత్తారు ఇందుమతి యాదవ్‌లను ఏకగీవ్రంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో యాదవులకు గొర్రెల పంపిణీ పథకం కింద రూ.రెండు లక్షల నగదు బదిలీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. హామీలు అమలు చేయకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని నాగభూషణం హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేకల సుగుణారావుయాదవ్, మాజీ కార్పొరేటర్ పగడాల నాగరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

ఖమ్మంసంక్షేమవిభాగం,మే4(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను తక్షణం నిలుపుదల చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శాంతిచర్చలు జరపాలని మావోయిస్టులు రెండుసార్లు పిలుపునిచ్చినా కేంద్ర ప్రభుత్వం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదివాసీలను అణిచివేత ధోరణితో కేంద్ర పారామిలటరీ బలగాలు వ్యవహరిస్తున్నాయన్నారు.వేలాది మంది కేంద్ర బలగాలను కర్రగుట్టలపై మోహరించి ఆదివాసీ అటవీప్రాంతాల్లో యుద్ధ వాతావరణాన్ని రూపొందించారని ఆరోపించారు. కేంద్ర రక్షణ మంత్రిఅమిత్‌షా మాటలు రెచ్చగొట్టేలా ఉన్నాయని శాంతిభద్రతలను కాపాడే విధానంగా లేవని ఆరోపించారు. అటవీ ప్రాంతంలోని సహజ వనరులను కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు.



ఈ సమావేశంలో జిల్లాకమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు మాదినేని రమేశ్, యం సుబ్బారావు, మెరుగు సత్యనారాయణ, డాక్టర్ భారవి, బోడపట్ల రవీందర్, మల్లెంపాటి వీరభద్రం,రమ్యబోడపట్ల సుదర్శన్‌పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

» స్థానిక ఎన్నికలకు సిద్ధమవుదాం

» టీడీపీ పాలేరు ఇన్‌చార్జ్ కరుణాకర్



టీడీపీ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

నేలకొండపల్లి, మే4(ఆంధ్రజ్యోతి): పార్టీ సంస్థాగత ఎన్నికలను పూర్తి చేసుకుని, త్వరలో రానున్న స్థానిక ఎన్నికలకు పార్టీ కార్యకర్తలను సిద్ధం చేద్దామని టీడీపీ పాలేరు ఇన్‌చార్జ్ కొండబాల కరుణాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం నేలకొండపల్లి వాసవీభవన్‌లో జరిగిన పార్టీ మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ బలంగా ఉందని, కార్యకర్తలను ఒక తాటిపైకి తెచ్చే బాధ్యతను నాయకులు తీసుకోవాలన్నారు. కార్యకర్తలకు నాయకులు అండగా నిలవాలన్నారు. అన్నిగ్రామాల్లో కమిటీలను నియమించటానికి పేర్లను కార్యకర్తల నుంచి సేకరించారు. త్వరలోనే కార్యకర్తల అభీష్టం మేరకు కమిటీలను నియమిస్తామన్నారు. జిల్లా, మండల నాయకులు పాలడుగు కృష్ణప్రసాద్, సూరపనేని రామకృష్ణ, తలశీల గోపాలరావు, నలమాస మల్లయ్య, అక్కినేని నాగేశ్వరరావు, వీసం శ్రీనివాసరావు, నూకహనుమంతరావు, నల్లమల వెంకటేశ్వర్లు, కోలేటి మస్తాన్‌రావు, గోగినేని సీతారాంబాబు, తాటికొండ నాగేశ్వరరావు, కారంగుల వీరబాబు, మద్దినేని మహేష్, పచ్చా సీతారామయ్య, పావులూరి వెంకటేశ్వరరావు, రావెళ్ల వెంకటేశ్వర్లు, వంకాయలపాటి పద్మ పాల్గొన్నారు.

8న హైదరాబాద్‌లో ‘రైతుధర్నా’

పోస్టర్ ఆవిష్కరించిన ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం,మే4(ఆంధ్రజ్యోతి): ఈనెల8న హైదరాబాద్ రైతుధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం. రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ చిన్న,సన్నకారు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చి పరోక్షంగా వ్యవసాయరంగాన్ని దెబ్బతీసి కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేసి అప్పగించేందుకు కార్యచరణ చేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పోడిగించి రోజుకు ఒక్కొకూలీకి రూ.600ఇవ్వాలని కోరారు. 2006 అటవీహక్కుల చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారానికి ఈనెల 8న ఛలో ఇందిరాపార్క్ రైతునిరసన కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కేలోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మధుకాన్ ఎండీ జన్మదినం

నేలకొండపల్లి, మే4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజేశ్వరపురం వద్ద ఉన్న మధుకాన్ షుగర్స్‌పవర్ ఇండస్ట్రీస్ ఎండీ నామా కృష్ణయ్య జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫ్యాక్టరీ ఆవరణలో కేక్‌ను కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఫ్యాక్టరీ ఆవరణలో రక్తదాన శిబిరంలో తలసీమియా బాధితుల కోసం రక్తదానం చేశారు. ఖమ్మంలోని అన్నక్యాంటీన్‌లో అన్నదానం నిర్వహించారు. అనంతరం ఫ్యాక్టరీ ఏవీపీ కోటయ్య మాట్లాడుతూ కృష్ణయ్య చెరుకు రైతుల అభివృద్ధికి అహర్నిషలు కృషి చేస్తున్నారన్నారు. కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారన్నారు. అధికారులు, ఉద్యోగులు, కార్మికులు,రైతులు కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏవీపీ కోటయ్య, డీజీఎం కేన్‌అప్పారావు, ఏజీఎం హెచ్‌ఆర్ నరేష్, అధికారులు పాల్గొన్నారు.



మధుకాన్ షుగర్స్‌లో కేక్ కట్ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

సామ్రాజ్యవాద దేశాలు ఉగ్రవాదాన్ని పెంచాయి

సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆవుల

ఖమ్మంసంక్షేమ విభాగం, మే4(ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద దేశాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించాయని, ప్రతీ దేశం ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటోందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఖైకొండాయిగూడెంలో నిర్వహించిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రారంభోసన్యాసం చేశారు. సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగిపోయిందని, మతతత్వ పార్టీల సోషల్ మీడియాలో అసత్యాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. వివిధ అంశాలపై సీనియర్ నాయకులు గుర్రం అచ్చయ్య, సీవై పుల్లయ్య, కోలేటి నాగేశ్వరరావు, పార్టీ నిర్మాణంపై ఆవుల అశోక్ బోధించారు. శిక్షణకు డివిజన్ కార్యదర్శి ఝాన్సీ ప్రిన్స్‌పాల్‌గా వ్యవహరించారు.



మాట్లాడుతున్న మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల

పాలేరులో రైతుల రాస్తారోకో

కూసుమంచి,మే4(ఆంధ్రజ్యోతి): పాలేరు కొనుగోలు కేంద్రం వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు రావడంతో ఆందోళన చెందిన రైతులు ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. ఐకేపీ కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసి ఉన్నప్పటికీ లారీలు రాకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో వర్షం కారణంగా ధాన్యం తడుస్తుండటంతో రహదారిపై బైఠాయించారు. అర్ధగంటకు పైగా రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సమాచారం తెలుసుకున్న కూసుమంచి ఎస్ఐ నాగరాజు హైవేపై వెళుతున్న రెండు లారీలను ఆపి కిరాయి మాట్లాడి ధాన్యం కేంద్రానికి పంపించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.



పాలేరులో రైతులు రాస్తారోకో చేస్తున్న దృశ్యం

బస్‌షెల్టర్ లేక ప్రయాణికుల ఇక్కట్లు

తిరుమలాయపాలెం, మే4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం తిరుమలాయపాలెంలో బస్‌షెల్టర్ లేక ప్రయాణికులు నానా ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం మండలానికి వివిధప్రాంతాల నుంచి వందలాది మంది ప్రయాణికులు పనుల కోసం రాకపోకలు సాగిస్తున్నారు. తిరుమలాపాలెంలో పోలీసుస్టేషన్, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం, పీహెచ్‌సీ, ఎంఈవో కార్యాలయానికి మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. వీరందరి సౌకర్యం కోసం తిరుమలాయపాలెంలో బస్టాండ్, బస్‌షెల్టర్ నిర్మించలేదు. దీంతో ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నానా అవస్థలు పడుతున్నారు. చెట్లు, హోటళ్ల కింద సేదతీరుతున్నారు. అధికారులు స్పందించి బస్‌షెల్టర్ నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బస్‌షెల్టర్ లేక చెట్ల కింద నిలుచున్న ప్రయాణికులు



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE వైరా-మధిర సత్తుపల్లి

సోమవారం 5 మే 2025

WYRA, MADHIRA, SATHUPALLY

సర్దార్ జలగం జయంతి

సత్తుపల్లిరూరల్, మే4 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి సర్దార్ జలగం వెంగళరావు జయంతి వేడుకలను ఆదివారం సత్తుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి స్థానిక జేవీఆర్ పార్క్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జలగం వెంగళరావు ఆశయాలు సాధించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌తో పాటు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి రైతు గుర్తింపు నమోదు

తల్లాడ/వేంసూరు, మే4(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో 11 అంకెల రైతుగుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తల్లాడ, వేంసూరు మండల వ్యవసాయ అధికారులు ఎండీ. తాజుద్దీన్, రామ్మోహన్‌రావులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనమేరకు భూ భారతి పోర్టల్‌లో భూమి ఉన్న ప్రతి రైతు వారి ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌లింకైన ఫోన్‌తో మీ క్లస్టర్ పరిధిలోని ఏఈవోలను సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీలో రైతు గుర్తింపు సంఖ్యకోసం నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంకిసాన్ రాష్ట్రీయ కృషివికాస్ యోజనం, భారత ఆహార భద్రత మిషన్ వంటి ప్రభుత్వపథకాలు రైతులకు అందాలంటే రైతుగుర్తింపు సంఖ్య తప్పనిసరి అని తెలిపారు.

నత్తనడకన రహదారి పనులు

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
» పట్టించుకోని అధికారులు



అసంపూర్తిగా మిగిలిన రోడ్డు నిర్మాణం

వైరా, మే 4 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డు నిర్మాణంలో అడుగడుగునా ఆర్‌అండ్‌బీ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. రూ.12కోట్లతో ఏడాది కింద చేపట్టిన ఈ రోడ్డు అభివృద్ధి పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. ఏడాది కాలంలో కేవలం 700 మీ టర్ల దూరం మాత్రమే ఒక వరుస బీటీ వేశా రు. నెలరోజుల నుంచి ఈ రోడ్డు నిర్మాణం పూ ర్తిగా నిలిచిపోయింది. బీటీ వేసిన ఓవైపు అంచు మొత్తం కందకంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది. వా హనాలు గోతుల్లోకి పడి భయకరమైన భారీ శబ్దాలతో ఇబ్బందికరంగా రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఏఒక్కరూ ప ట్టించుకున్న దాఖలాలు కన్పించడం లేదు. స్వ యంగా రెండురోజుల నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సంబంధితశాఖ అధికారులు తమ వాహనాలను కందకం వలె ఉన్న గుంతల్లోనుంచే రాకపోకలు కొనసాగించినప్పటికీ ఈ అధ్వాన పరిస్థితులను పట్టించుకోకపోవడం శోచనీయం.

వైరాలోని జాతీయ ప్రధాన రహదారి నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు వరకు దాదాపు 2.6కిలోమీటర్ల దూరం రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఏడాది కిందట పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కేవలం 700మీటర్ల దూరంలోనే రోడ్డు పనులు మొదలయ్యాయి. రోడ్డుకు ఒకవైపున రెండు వరుసల రోడ్డును 700మీటర్ల పొడవు ఒక వరుస బీటీ వేశారు. ఈ దూరంలోనే రెండోవైపు రెండువరుసల రోడ్డు మాత్రం వెట్‌మిక్స్ పనులు మాత్రమే కొంతమేర చేశా రు. ఇంకా ఆపనులు కూడా పూర్తిస్థాయిలో జరుగలేదు. మరో రెండు వరుసలు వెట్‌మిక్స్ బీటీ రోడ్డును నిర్మించాల్సి ఉంది. ఇకపోతే 1.9కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం మొదలే కాలేదు. కుడికాల్వపై కల్వర్టు, సోమవరం నల్లవాగుపై కాజ్‌వే వెడల్పు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణాలు ఎప్పుడు మొదలుపెడతారో ఏలేవారికే తెలియాల్సి ఉంది.

జాతీయ ప్రధాన రహదారి దగ్గర క్రాస్ రోడ్డు మొత్తం రెండు అడుగులలోతు గుంతలతో అధ్వానంగా ఉంది. అక్కడి నుంచి సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల వరకు ఈ రోడ్డు గుంతలమయంగా ఉంది. ఈ గుంతల్లో పిడికెడు మట్టి కూడా వేయకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కోసం మూడుచోట్ల రోడ్డు అంచుకే భారీ గుంతలు తవ్వి నాలుగైదునెలల నుంచి పూడ్చకుండా వదిలేశారు. అవి మరింత ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రోడ్డుపైన వాటర్‌క్యూరింగ్ కూడా లేకపోవడంతో దుమ్ముతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో స్థానికులు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

» డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



నిర్మాణాల గురించి తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా, మే 4 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించుకున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. వైరా మండలంలోని భట్టి స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో ఆదివారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి తమ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆకాశం దట్టమైన మేఘాలతో అలుముకొని భయంకర ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలోనే ఆయన ఈ పర్యటన చేశారు. శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న కల్యాణ మండపం, స్నానాల ఘా ట్, స్నానాల గదులు, ప్రహరీ నిర్మాణ పనులను డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈ ఆలయానికి ఎదురుగా వైరా నదిలో జరుగుతున్న హైలెవల్ వంతెన అలాగే చెక్‌డ్యాం, రిటైనింగ్ వాల్ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యతాప్రమాణాలు, పనుల తీరుతెన్నుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నూతి సత్యనారాయణ, ఐబీ, ఆర్‌అండ్‌బీ డీఈలు పి.శ్రీనివాస్, రమేష్, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వరరావు, మల్లు పట్టయ్య, పొట్టపల్లి నాగేశ్వరరావు, ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్ తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

» యాదవ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ నాగభూషణం

ఖమ్మంచర్చికాంపౌండ్, మే4(ఆంధ్రజ్యోతి): యాదవులకు ఇచ్చిన నగదు బదిలీ హామీని నెరవేర్చాలని తెలంగాణ యాదవ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని టీటీడీసీ భవన్‌లో జరిగిన సంఘం జనరల్‌బాడీ సమావేశంలో సంఘం ఖమ్మం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా కోడి లింగయ్య, ప్రధానకార్యదర్శిగా గుమ్మ రోశయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా భారీ మల్సూర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా చిత్తారు ఇందుమతి యాదవ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కూరాకుల నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్రంలో యాదవులకు గొర్రెల పంపిణీ పథకం కింద రూ.రెండు లక్షల నగదు బదిలీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. యాదవుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హామీలు అ మలుచేయకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని నాగభూషణం హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మేకల సుగుణారావుయాదవ్, మాజీ కార్పొరేటర్ పగడాల నాగరాజుయాదవ్ పాల్గొన్నారు.

అలసత్వం వీడి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

వైరా, మే 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు అలసత్వాన్ని వీడి రబీలోని వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పలువురు నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకుడు సంక్రాంతి మధుసూదన్‌రావు సంతాప సభ ఆదివారం వైరాలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న లాలాపురం గ్రామంలో జరిగే సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభను విజయవంతం చేయాలని కోరారు. సంస్మరణ సభకు సీపీఎం పొలిట్‌బ్యూరో స భ్యుడు బీవీ.రాఘవులు, కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎస్.సాయిబాబా, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు హాజరవుతారని తెలిపారు. పేదల పక్షపాతి మధుసూదన్‌రావు అని కొనియాడారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభు త్వ అలసత్వాన్ని తీవ్రంగా నిరసించారు. అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, మచ్చా మణి, దొంతెబోయిన నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ముదిగొండ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ముదిగొండ, మే 4 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ పాఠశాలలో 35ఏళ్ల క్రితం 1989-90లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు. తమ జీవితాల్లో సాధించిన విజయాల గురించి వేదికపై ఒకరికొకరు పంచుకున్నారు. సమ్మేళనానికి హాజరైన నాటి గురువులను సత్కరించారు. ఆతర్వాత పూర్వవిద్యార్థులంతా సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం పూర్వవిద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు కమర్తపు కిరణ్, వెంపటి శ్రీను, యలమద్ది శ్రీను, ఇంద్రకుమార్, మాచర్ల ఉపేందర్, బంకా మల్లయ్య, షేక్.ఖాసీం, నక్కా నర్సింహారావు, పరిపూర్ణాచారి, కమర్తపు సత్యనారాయణ పాల్గొన్నారు.



కల్లూరులో...

కల్లూరు, మే4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003-04 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. నాటి తీపి జ్ఞాపకాలు, గురువుల విద్యా బోధన, తరగతి గదిలో చిన్న నాటి జ్ఞాపకాలను నేమర వేసుకున్నారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. నాటి ఉపాధ్యాయులైన ఎండీ మౌలాలి, చక్రవర్తి, మార్క్, రాంబాబు, విజయ, సుజాత, మధు, గోపాల్‌రెడ్డిలను శాలువలతో సత్కరించారు. ఈ బ్యాచ్ తరుపున పూర్వ విద్యార్థులు పాఠశాలకు అవసరమైన ఇనుప గ్రిల్‌ను వితరణ చేశారు. పాఠశాలలో జరిగిన ఈ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని పాఠశాలకు గ్రిల్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మేచర్ల రాధా, నాగభద్రాచారి, శివకిషోర్, మురళి, విజయ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయాధికారి మృతికి సంతాపం

ఖమ్మంలీగల్, మే4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయాధికారి ప్రియదర్శిని ఆదివారం అకాల మృతికి జిల్లా న్యాయవాదులు సంతాపం తెలిపారు. ఆమె జిల్లా న్యాయాధికారిగా పని చేసిన సమయంలో ఎనలేని సేవలందించారని గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, దిలీప్ కుమార్, పలువురు సంతాపం తెలిపారు.

సామ్రాజ్యవాద దేశాలు ఉగ్రవాదాన్ని పెంచాయి

» సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల



మాట్లాడుతున్న ఆవుల వెంకటేశ్వర్లు

ఖమ్మంసంక్షేమ విభాగం, మే4(ఆంధ్రజ్యోతి): సామ్రాజ్యవాద దేశాలు ఉగ్రవాదాన్ని పెంచి పోషించాయని, ప్రతీ దేశం ఇప్పుడు మూల్యం చెల్లించుకుంటోందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లాకార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని బైకొండాయిగూడెంలో నిర్వహించిన పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రారంభోపన్యాసం చేశారు. సోషల్‌మీడియా ప్రభావం బాగా పెరిగిపోయిందని, మతతత్వపార్టీల సోషల్‌మీడియాలో అసత్యాలను ప్రచారం చేస్తున్నాయన్నారు. వివిధ అంశాలపై సీనియర్ నాయకులు గుర్రం అచ్చయ్యసీపై పుల్లయ్య, కోలేటి నాగేశ్వరరావు, పార్టీ నిర్మాణంపై ఆవుల అశోక్ క్లాస్‌లో బోధించారు. శిక్షణకు డివిజన్ కార్యదర్శి ఝాన్సీ ప్రిన్స్‌పాల్‌గా వ్యవహరించారు.

8న హైదరాబాద్‌లో 'రైతుధర్నా'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 8న రైతుధర్నా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం.రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ చిన్న,సన్నకారు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయన్నారు. జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చి పరోక్షంగా వ్యవసాయరంగాన్ని దెబ్బతీసి కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ వేసి అప్పగించేందుకు కార్యచరణ చేస్తున్నాయన్నారు. ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పొడిగించి రోజుకు ఒక్కోకూలీకి రూ.600ఇవ్వాలని కోరారు. 2006 అటవీహక్కుల చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యల పరిష్కారానికి ఈనెల 8న ఛలో ఇందిరాపార్క్ రైతునిరసన కార్యక్రమానికి పిలుపు నిచ్చామని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు కోలేటి నాగేశ్వరరావు, కేలోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పెనుబల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వడదెబ్బకు గురై మృతిచెందిన కొత్తకారాయిగూడెం గ్రామానికి చెందిన నెల్లూరు బోధనాచారి కుటుంబానికి పాత కారాయిగూడెం గ్రామానికి చెందిన మమత పబ్లిక్ స్కూల్ 2003-2004 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు రూ.20వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. బోధనాచారి కుటుంబానికి అండగా ఉన్నామన్నారు. బోధనాచారి చిత్రపటానికి పూలమల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులను అందజేస్తున్న ఝాన్సీరాణి, రాజేశ్వరరావు

పెనుబల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆపార్టీ నాయకులు తలసాని ఝాన్సీరాణి, తుమ్మలపల్లి రాజేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగిన సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోమటి కృష్ణారావు, జ్యోతి, సయ్యద్ బాబు, దిరిశాల రాము, కల్లూరి రామారావు, పంతంగి వెంకటేశ్వరరావు, బాబూరావు, కనకారావు, చెన్నారావు, శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి కూలీల అవస్థలు

» పని ప్రదేశంలో నీళ్లూ, నీడ కరువు » సౌకర్యాలు కల్పించని అధికారులు



ఎర్రబోయినపల్లిలో పని ప్రదేశంలో టెంట్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు

కల్లూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల ప్రదేశంలో మండల స్థాయి అధికారులు పలు గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. అసలే వేసవి సీజన్ కావడంతో పగటి పూట సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉం ది. ఈ సమయంలో ఉపాధి పనులు చేసిన కూలీలు కొంతసేపు సేద తీర్చుకునేందుకు ప్రదేశాల్లో నీడ సౌకర్యంతో పాటుగా తాగునీరు సౌక ర్యం ఉండాలి. అందుకు నిదర్శనంగా ఎర్రబోయినపల్లి గ్రామంలో ఉపాధి పనులకు గాను సుమారు 200మంది కూలీలు పనులకు వెళ్లుతున్నారు. ఆయా పనుల పర్యవేక్షణకు గాను ఫీల్డ్ అసిస్టెంట్ కూడా లేరు. పైగా కూలీల పనులకు గాను హాజరు కూడా పంచాయతీ కారదర్శి చూస్తున్నట్లు తెలిసింది. ఇంకా చేసిన పనులకు కొలతలు కూడా కార్యదర్శి బాధ్యత వహించాల్సి వస్తుంది. ఇక్కడ గతంలో విధులు నిర్వర్తించిన ఫీల్డ్ అసిస్టెంట్ మృతి చెందగా ఆయన స్థానంలో కొత్తవారిని అధికారులు నియమించలేదు. ఈ పరిస్థితుల్లో వైబీ పల్లిలో ఉపాధి పనులకు వచ్చిన కూలీలు కనీస సౌకర్యాలైన టెంట్, వాటర్, మెడికల్ కిట్ వంటి సౌకర్యాలు కరువయ్యాయని కూలీలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనుల ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

వాన మబ్బుతో శనివారం ఒక్క రోజు మాత్రమే టెంట్ ఏర్పాటు చేయలేదని ఎర్రబోయినపల్లి పంచాయతీ కార్యదర్శి సైదులు తెలిపారు. రోజు వారీగా టెంట్, తాగునీరు ఏర్పాటు జరగుతుందన్నారు.

'ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి'

దమ్మపేట, మే4(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేయనున్నట్లు భద్రాద్రి కొత్తగూడెం ఆర్యవైశ్యసంఘం జిల్లా అధ్యక్షుడు దారా రమేష్ అన్నారు. దమ్మపేట మండల ఆర్యవైశ్యసంఘం సభ్యులను ఆదివారం కలిసారు. స్థానిక అయ్యప్ప స్వామి ప్రాంగణంలో మండల అధ్యక్షుడు పసుమర్తి రాంభద్రం అధ్యకత జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు దారా యుగంధర్, జిల్లా సభ్యత్వ నమోదు కమిటీ చైర్మన్ పల్లెపర్ల చంద్రశేఖర్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాలేరులో రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

కూసుమంచి, మే 4(ఆంధ్రజ్యోతి): పాలేరు కొనుగోలు కేంద్రం వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు రావడంతో ఆందోళన చెందిన రైతులు ఖమ్మం-సూర్యాపేట ప్రధాన రహదారిపై రాస్తారోకోకు దిగారు. ఐకేపీ కేంద్రంలో ధాన్యం కాంటాలు వేసి ఉన్నప్పటికీ లారీలు రాకపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో వర్షం కారణంగా ధాన్యం తడుస్తుండటంతో రహదారిపై బైఠాయించారు. అర్ధగంటకు పైగా రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సమాచారం తెలుసుకున్న కూసుమంచి ఎస్ఐ నాగరాజు హైవే పై వెళుతున్న రెండు లారీలను ఆపి ధాన్యాన్ని కేంద్రానికి పంపించారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. అనంతరం కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.

అధ్వానంగా ఎమ్మార్సీ భవనం



పిల్లర్ల మీదనే ఆగి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

ఏన్కూరు, మే4(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖకు సంబంధించిన ఎమ్మార్సీ భవనం అధ్వాన స్థితిలో ఉంది. ఈభవనం చుట్టూ గోడ కూలింది. పిల్లర్ల మీదనే భవనం ఆధారపడి ఉంది. దీనిలో కొంత భాగాన్ని వదిలేసి ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మండలంలోని అన్ని పాఠశాలల ముఖ్యమైన సమాచారం ఇక్కడే ఉంటుంది. ఎమ్మార్సీ భవనానికి నిత్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు అవసరాల నిమిత్తం వస్తుంటారు. ఇంతటి విలువైన భవనాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరుకు గదుల్లో సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలం చుట్టూ వరదనీరు లోపలికి చేరడంతో ఫైళ్లు, కంప్యూటర్లు తడిచి పోతున్నాయి. హెచ్‌ఎంల సమావేశాలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. టెస్టుపుస్తకాలు, యూనిఫారాలు, టీచర్ల మాడ్యూల్స్ నిలవ చేయడానికి అసౌకర్యంగా ఉంది. కొత్త భవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.